www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

| సంపుటి : 17 | సంచిక : 176 | బుధవారం 19.08.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/- |
|---|---|---|---|---|---|



**విలేకరులు కావలెను**

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు,నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039


# కేసీఆర్ దశ దిశ బాగోలేదు

డీలిమిటేషన్ తర్వాత మళ్లీ కాంగ్రెస్‌దే అధికారం

కుల వృత్తులకు అండగా ప్రజా ప్రభుత్వం

## బీఆర్ఎస్ చేసిన అప్పులు రాష్ట్రానికి ముప్పు





- ట్యాంక్‌బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం
- బహుజనుల హక్కుల కోసం పోరాడిన వీరుడు పాపన్న
- పాపన్న విగ్రహం స్థలాన్ని స్వయంగా ఎంపిక చేశా
- అమరవీరుల స్థూపంతో సమానంగా పాపన్న విగ్రహానికి ప్రాధాన్యం
- సామాజిక న్యాయం, బహుజన ఆత్మగౌరవమే లక్ష్యం
- గీత కార్మికుల చిరకాల ఆకాంక్ష నెరవేర్చు
- పిల్లల ఉన్నత విద్య కోసం ఎన్ని వందల కోట్లయినా ఖర్చు చేస్తాం
- బీసీ జనాభా లెక్కలు తేల్చిన తొలి ప్రభుత్వం మాదే
- బీఆర్ఎస్ చేసిన అప్పులు రాష్ట్రానికి ముప్పుగా మారాయి
- కేటీఆర్, హరీశ్‌రావుపై సీఎం రేవంత్ తీవ్ర విమర్శలు
- కరవు రావాలని కోరుకుంటూ చేతబడులు చేయించారంటూ ఆరోపణలు
- మళ్లీ పాత దొరల పాలనకు అవకాశం ఇవ్వొద్దు
- బీసీలను కుల వృత్తులకే పరిమితం చేయాలని చూశారు

02

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**

తెలంగాణ చరిత్రలోనే బీసీల జనాభా లెక్కలు తేల్చి సామాజిక న్యాయం అందించిన తొలి ప్రభుత్వం తమదేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ పాలకులు చేసిన వేల కోట్ల అప్పులు ఈనాడు రాష్ట్రానికి పెద్ద ముప్పుగా మారాయని, ఆ అప్పులకు నిరంతరం వడ్డీలు చెల్లిస్తూనే తమ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని ఆయన తెలిపారు. ఇదే సమయంలో ప్రతిపక్షంలో ఉన్న బావబావమరుదులు కేటీఆర్, హరీష్ రావు ప్రభుత్వంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, రాష్ట్రంలో కరవు రావాలని కోరుకుంటూ తమిళనాడు నుంచి అఘోరాలను రప్పించి చేతబడులు చేయించారని సంచలన ఆరోపణలు చేశారు. సాధారణంగా ఊళ్లలో చేతబడులు చేసేవారిని చెట్లకు కట్టేసి కొడతారని దుయ్యబట్టిన ఆయన, ప్రజలు కష్టపడి తెచ్చుకున్న ఈ 'ప్రజాపాలన'ను కాపాడుకోవాలని, మళ్లీ పాత దొరల పాలన రావడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దని పిలుపునిచ్చారు.





# పాడైపోయిన క్రీమ్‌తో నెయ్యి దందా..

పాడైపోయిన క్రీమ్, పామాయిల్, వనస్పతిని నెయ్యిలో కలుపుతున్నారు

హోటళ్లు, ఫంక్షన్ హాళ్లు, స్వీట్ షాపులకు సరఫరా

## ఏకంగా 25.5 టన్నుల కల్తీ నెయ్యి సీజ్

- ప్రమాదకర రసాయనాలతో నెయ్యి తయారు చేస్తున్నట్లు గుర్తించారు
- దాడుల్లో భారీగా కల్తీ పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు
- ఏకంగా 25.5 టన్నుల కల్తీ నెయ్యి సీజ్ చేశారు
- మరో 10.5 టన్నుల ముడి పదార్థాలు కూడా పట్టుబడ్డాయి
- మొత్తంగా 36 టన్నుల కల్తీ సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు
- పాడైపోయిన క్రీమ్, పామాయిల్, వనస్పతిని నెయ్యిలో కలుపుతున్నారు
- పాల పౌడర్, గంజి పొడితో కల్తీ చేస్తున్నారు

05

# నేనే సారీ చెప్పా..

## నువ్వు బయటపెట్టిందేముంది?

హరీశ్‌రావు కాదు.. అబద్ధాలరావు: పొంగులేటి

- 22ఏతో ప్రైవేట్ ఆస్తులకు ఇబ్బంది నిజమే: పొంగులేటి
- జరిగిన పొరపాటును భేషరతుగా సరిదిద్దుతాం
- 22ఏ వివాదాన్ని దాచే ప్రసక్తే లేదు
- 22ఏ సమస్యపై యుద్ధప్రాతిపదికన చర్యలు
- బాధితుల ఆస్తులకు పూర్తి రక్షణ: పొంగులేటి
- ఈ నెలాఖరులోగా 22ఏ సమస్య పరిష్కారం
- సమస్యల పరిష్కారానికి నేడు ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- 15 రోజుల్లో 22ఏ బాధితుల సమస్యలకు పరిష్కారం

03



22ఏతో ప్రైవేట్ ఆస్తులకు ఇబ్బంది కలిగిన మాట నిజమేనని అయితే ఈ వివాదాన్ని దాచిపెట్టాలనో, ప్రజలను మభ్యపెట్టాలనో నేను కానీ మా ప్రభుత్వం కానీ అనుకోవడం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. జరిగిన వాస్తవం ఏంటో ప్రజలకు నిన్నే వివరించామని ఈ వివాదంలో జరిగిన పొరపాటును భేషరతుగా సరిద్దితామని చెప్పామని ఇప్పటికే సరిదిద్దే ప్రయత్నం మొదలుపెట్టామన్నారు. ఇవాళ ఓ న్యూస్ చానల్ తో మాట్లాడిన పొంగులేటి.. ప్రజల ఆస్తులను 22ఏలో ఉద్దేశపూర్వకంగానే పెట్టి వాటిని రిలీజ్ చేయడానికి డబ్బులు వసూలు చేయడానికే ఈ తతంగాన్ని నడుపుతున్నారంటూ...



మంత్రి పొంగులేటి రాజీనామాకు

# హరీశ్‌రావు డిమాండ్

## పెట్టింది మీరే తీయాల్సింది మీరే..

- 22ఏ భూముల జాబితాపై హరీశ్‌రావు ఆగ్రహం
- ప్రభుత్వం చేసిన తప్పులకు ప్రజలు ఎందుకు తిరగాలి?
- పొంగులేటి రాజీనామా చేయాలని హరీశ్‌రావు డిమాండ్
- 22ఏ నిషేధిత భూముల జాబితాను రద్దు చేయాలి
- పెట్టింది మీరే.. తీసేయాల్సింది మీరే: హరీశ్‌రావు
- కల్యాణలక్ష్మి ఇప్పుడు సంతానలక్ష్మిగా మారింది
- ప్రజలకు అండగా బీఆర్ఎస్ పోరాటం: హరీశ్‌రావు

02

రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ రేవంత్ రెడ్డి వెంటనే సంబంధిత మంత్రిని పదవి నుంచి తొలగించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. మంత్రి చేసిన తప్పులకు సీఎం చర్యలు తీసుకోకపోతే.. ఇద్దరూ కలిసి కుట్రపూరితంగా ఈ భూదందా చేశారనే అనుమానాలు ప్రజల్లో మరింత బలపడతాయని అన్నారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన తప్పు ఏమీ లేనట్లుగా అధికారులపై నెపం...

# టెక్ విద్యకు తగ్గిన క్రేజ్..

330 సీట్లకు కేవలం 60 మంది విద్యార్థులే చేరిక

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2,173కి పైగా ఇంజనీరింగ్ సీట్లు ఖాళీ

## ల్యాబ్‌లు, ఫ్యాకల్టీ కొరతే కారణమా..?



- కేయూ ఇంజనీరింగ్ కాలేజీకి మాత్రం విద్యార్థుల నుంచి మంచి డిమాండ్
- ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో వందల సంఖ్యలో సీట్లు మిగులు
- ఒక కాలేజీలో 600.. మరో కాలేజీలో 467 సీట్లు ఖాళీ
- ల్యాబ్‌లు, అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ కొరతే కారణమా?
- ప్లేస్‌మెంట్ల కోసం హైదరాబాద్ కాలేజీల వైపు విద్యార్థుల మొగ్గు

05




# మేకవన్నే పులిలా రేవంత్ రెడ్డి

మేము అధికారంలోకి వస్తే కుటుంబానికి ఎకరం భూమి..

## రాష్ట్రంలో రేవంత్ రెడ్డి రాక్షస పాలన

ప్రొఫెసర్ జయంతి సందర్భంగా తెలంగాణలో సామాజిక న్యాయం సాధించాలనే సంకల్పం తీసుకోగానే గత 31 నెలల్లో ఏనాడూ సామాజిక న్యాయం పదం ఉచ్ఛరించని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- అధికారంలోకి వస్తే భూమిలేని పేదలకు ఎకరం భూమి
- 'భూ లక్ష్మి పథకం'తో పేదలకు భూ పంపిణీ చేస్తామని ప్రకటన
- అసైన్డ్ భూములను ప్రభుత్వం లాక్కుంటోందని కవిత ఆరోపణ

03




# పొంగులేటి రాజీనామాకు హరీశ్‌రావు డిమాండ్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రేవంత్ రెడ్డి తీరు పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం.. కొత్త సమస్యలను సృష్టిస్తోందని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. రాత్రికి రాత్రే కాలనీలకు కాలనీలను 22ఏ నిషేధిత జాబితాలో చేరిస్తే ప్రజలు ఎక్కడికి పోవాలి? ప్రభుత్వం చేసిన తప్పులకు ప్రజలు అధికారుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరగాలా? అని ప్రశ్నించారు. నిషేధిత భూముల తప్పిదంలో నైతిక బాధ్యత వహించి మంత్రి పదవికి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు కలిసి చేసిన తప్పును అధికారుల మీదకు నెట్టడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 22ఏ నిషేధిత భూముల జాబితాను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఇవాళ మల్కాజ్‌గిరిలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో హరీశ్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

**టోల్‌ఫ్రీ నంబర్ పని చేయడం లేదు:**

రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ రేవంత్ రెడ్డి వెంటనే సంబంధిత మంత్రిని పదవి నుంచి తొలగించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. మంత్రి చేసిన తప్పులకు సీఎం చర్యలు తీసుకోకపోతే.. ఇద్దరూ కలిసి కుట్రపూరితంగా ఈ భూదందా చేశారనే అనుమానాలు ప్రజల్లో మరింత బలపడతాయని అన్నారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన తప్పు ఏమీ లేనట్లుగా అధికారులపై నెపం నెట్టడం సరికాదన్నారు. పెద్ద తప్పు చేసి ఇప్పుడు సారీ చెబుతున్నారు. సారీ చెబితే ప్రజల బాధలు తీరుతాయా? అసలు జాబితాలో భూములను చేర్చింది ఎవరు? చేర్చమని ఆదేశించింది ఎవరు? ఇష్టానుసారంగా జాబితాలో పెడతారా? అధికారుల పేర్లు చెప్పి తప్పించుకుంటారా? అని నిలదీశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ కూడా సక్రమంగా పనిచేయడం లేదని ఇది ఎంత దగా ప్రభుత్వం? అని ప్రశ్నించారు.

**పెట్టింది మీరే తీయాల్సింది మీరే..**

నిషేధిత జాబితాలో పెట్టింది మీరే కాబట్టి.. తీసేయాల్సింది కూడా మీరేనని ఎట్లా పెట్టారో.. అట్లాగే తొలగించాలన్నారు. ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోకుండా, వారిని కార్యాలయాల చుట్టూ తిప్పకుండా నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించాలని డిమాండ్ చేశారు. 2008లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ULCని రద్దు చేసిందని, ఆ తర్వాత ఆ భూములు పట్టా భూములుగా మారి, ఏళ్లుగా ప్రజలు అక్కడ నివసిస్తున్నారని తెలిపారు. 20 ఏళ్లుగా లేని సమస్యను ఇప్పుడు ఎందుకు సృష్టించారని ప్రశ్నించారు. రంగారెడ్డిలో 7,500 జీఓల ద్వారా మినహాయింపు పొందిన భూములు, మేడ్చల్‌లో 6,000కు పైగా భూములు, HMDA, HUDA భూములను కూడా నిషేధిత జాబితాలో చేర్చారని ఆరోపించారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలపై పట్టు సాధించేందుకే నిషేధిత భూముల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని తప్పు చేసిన ఈ కాంగ్రెస్ నాయకులను చట్టపరంగా బాధ్యులను చేస్తామన్నారు. 22ఏ నిషేధిత భూముల విషయంలో అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని కేసీఆర్ నాయకత్వంలో మేమంతా ప్రజలకు అండగా ఉంటామన్నారు.

**కల్యాణలక్ష్మి ఇప్పుడు సంతానలక్ష్మిగా మారింది:**

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల విషయంలో కూడా ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని హరీశ్ రావు ఆరోపించారు. కోర్టులో కౌంటర్ కూడా దాఖలు చేయకుండా కావాలనే నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. కేసీఆర్ హయాంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కోసం రూ.2,600 కోట్లు కేటాయిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రూ.800 కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. కల్యాణలక్ష్మి ఇప్పుడు సంతానలక్ష్మిగా మారింది. పెళ్లి సమయంలో అందాల్సిన సాయం పిల్లలు పుట్టిన తర్వాత వస్తోంది. కల్యాణలక్ష్మి విషయంలో పొన్నం ప్రభాకర్ అధికారుల తప్పు అంటున్నారు. నిషేధిత భూముల విషయంలో పొంగులేటి కూడా అధికారుల తప్పు అంటున్నారు. తప్పు మీది.. అధికారులది కాదు. తప్పు మీరు చేస్తారు.. దరఖాస్తులు మాత్రం ప్రజలు పెట్టుకోవాలా? అని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కేసీఆర్ దిశ, దశ బాగోలేదు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** బహుజనుల హక్కుల కోసం పోరాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. ఇవాళ నగరంలో ట్యాంక్‌బండ్‌పై నూతనంగా ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్న గౌడ్ కాంస్య విగ్రహాన్ని సీఎం రేవంత్ రెడ్డి.. పలువురు మంత్రులు, బీసీ సంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ట్యాంక్‌బండ్‌కు వచ్చే ప్రతి పర్యాటకుడికి కనిపించేలా ఈ విగ్రహ ఏర్పాటు స్థలాన్ని తానే స్వయంగా ఎంపిక చేశానని తెలిపారు. విగ్రహ ప్రాశస్త్యం కోసం అక్కడే ఉన్న టూరిజం కార్యాలయాన్ని కూడా ఖాళీ చేయించామని, అమరవీరుల స్తూపానికి ఉన్నంత ప్రాధాన్యత పాపన్న గౌడ్ విగ్రహానికి ఉంటుందని చెప్పారు.

**సామాజిక న్యాయం - బహుజన ఆత్మగౌరవం..**

సర్వాయి పాపన్న వీరగాథను లండన్‌లోని బ్రిటీష్ లైబ్రరీలో సైతం భద్రపరిచారని సీఎం గుర్తుచేశారు. బహుజనుల నుంచి పుట్టుకొచ్చిన ఈ వీరుడి విగ్రహాన్ని నెలకొల్పాలని గీత కార్మికులు ఎంతో తాపత్రయపడ్డారని, తమ ప్రజాపాలనలో సామాజిక న్యాయం, సమాన అవకాశాలకు పెద్దపీట వేస్తున్నామని స్పష్టం చేశారు.

**కుల వృత్తులకు ఆసరా..**

రాష్ట్రంలో నేత, గీత కార్మికులకు పెన్షన్లు ఇవ్వాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని సీఎం తెలిపారు. ప్రభుత్వ భూములు ఎక్కడ ఉన్నా ఈత, తాటి చెట్లను పెంచాలని పిలుపునిచ్చారు. కుల వృత్తులను గౌరవిస్తూనే పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని, పిల్లల చదువు కోసం ఎన్ని వందల కోట్లయినా ఖర్చు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు.

**బావ, బావమరిది అబద్ధపు ప్రచారం..**

తెలంగాణ చరిత్రలోనే బీసీల జనాభా లెక్కలు తేల్చి సామాజిక న్యాయం అందించిన తొలి ప్రభుత్వం తమదేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ పాలకులు చేసిన వేల కోట్ల అప్పులు ఈనాడు రాష్ట్రానికి పెద్ద ముప్పుగా మారాయని, ఆ అప్పులకు నిరంతరం వడ్డీలు చెల్లిస్తూనే తమ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని ఆయన తెలిపారు. ఇదే సమయంలో ప్రతిపక్షంలో ఉన్న బావబావమరుదులు కేటీఆర్, హరీష్ రావు ప్రభుత్వంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, రాష్ట్రంలో కరవు రావాలని కోరుకుంటూ తమిళనాడు నుంచి అఘోరాలను రప్పించి చేతబడులు చేయించారని సంచలన ఆరోపణలు చేశారు. సాధారణంగా ఊళ్లలో చేతబడులు చేసేవారిని చెట్లకు కట్టేసి కొడతారని దుయ్యబట్టిన ఆయన, ప్రజలు కష్టపడి తెచ్చుకున్న ఈ 'ప్రజాపాలన'ను కాపాడుకోవాలని, మళ్లీ పాత దొరల పాలన రావడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దని పిలుపునిచ్చారు.

**కేసీఆర్ పాలనపై సెటైర్లు:**

గత బిఆర్ఎస్ పాలనపై సీఎం రేవంత్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'నాడు గొర్రెలు, బర్రెలు, చేపలు పంపిణీ చేసి.. రాజ్యం వాళ్లు ఏలుతూ, మనల్ని కుల వృత్తులకే పరిమితం చేయాలని చూశారు' అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ సీఎం అయితే ఆయన కొడుకు కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్, అల్లుడు హరీశ్ రావు మంత్రి అయ్యారని.. అదే రేవంత్ సీఎం అయితే బీసీ నేత మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్, సీతక్క, వాకిటి శ్రీహరి మంత్రులయ్యారని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనుమరాలికి కీలక పదవులు ఇచ్చి ఉద్యమకారులను గౌరవించామని తెలిపారు. రాబోయే డీలిమిటేషన్ తర్వాత 117 సీట్లతో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## మొన్న 'ఉత్తమ' అధికారిగా అవార్డు..



**ఒంగోలు :** డబ్బులకు ఆశపడి కొందరు ప్రభుత్వ అధికారులు పరువు పోగొట్టుకుంటున్నారు. ప్రజలు పనికోసం వెళితే లంచం కోసం వేధిస్తూ ఇబ్బంది పెడుతున్నారు. అధికారి వేధింపులకు తట్టుకోలేక కొందరు ఏసీబీకి ఫిర్యాదు చేయడంతో పరువు పోగొట్టుకోవడమే కాక ఉద్యోగం నుండి సస్పెండ్ అవుతున్నారు. తాజాగా ఓ అధికారి తీరు అయితే మరింత షాకింగ్ గా మారింది. మొన్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఉత్తమ అధికారిగా అవార్డు తీసుకున్న వ్యక్తే నేడు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. ఈ ఘటన ఏపీలోని ఒంగోలులో చోటు చేసుకుంది. ఒంగోలు కార్పోరేషన్ ఆర్ఐ నరేంద్ర కొత్త ఇంటికి పన్ను విధించేందుకు రూ.15వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితులు ఏసీబీకి ఫిర్యాదు చేయడంతో రెడ్ హ్యాండెడ్ గా లంచం ఇస్తుండగా అధికారిని పట్టుకున్నారు. రెండు రోజుల క్రితం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఉత్తమ అధికారిగా నరేంద్ర మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకున్నాడు. రెండు రోజులకే లంచం తీసుకుని పట్టుబడటంతో స్థానికులు ఆయనపై మండిపడుతున్నారు. ఇలాంటి వాడికి అసలు అవార్డు ఎలా ఇచ్చారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## రెడ్ హ్యాండెడ్‌గా చిక్కిన అటవీశాఖ అధికారులు

**నాగర్‌కర్నూల్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు అవినీతి అధికారులపై ఫుల్ ఫోకస్ పెట్టారు. తాజాగా రూ.50 వేలు లంచం తీసుకుంటున్న అటవీశాఖ అధికారులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల అటవీ అధికారి కార్యాలయంలో ఇవాళ ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. నల్లమల అటవీప్రాంతం నుంచి కట్టెలు తరలిస్తున్న వ్యక్తుల నుంచి అటవీశాఖ అధికారులు లంచం డిమాండ్ చేశారు. బాధితుల నుంచి రూ.50 వేలు లంచంగా తీసుకుంటుండగా.. ముందస్తు పక్కా ప్లాన్ ప్రకారం ఏసీబీ అధికారులు దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు.అయితే, బాధితులు ఇప్పటికే రూ.50 వేలు చెల్లించినప్పటికీ, అధికారులు ఇంకా అదనపు డబ్బు కావాలని ఒత్తిడి తెచ్చినట్లుగా తెలుస్తోంది. దీంతో వారి వేధింపులు తాళలేక బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఈ మేరకు ఇవాళ కార్యాలయంలో సోదాలు చేపట్టిన ఏసీబీ టీమ్ లంచం సొమ్మును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి సదరు అటవీ శాఖ అధికారను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



## మహాత్మా గాంధీపై కూడా కేసు పెట్టండి

**న్యూ ఢిల్లీ :** ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో 'వందేమాతరం' గేయాలాపనకు అంతరాయం కలిగించేందుకు యత్నించారంటూ సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై దాఖలైన పోలీసు ఫిర్యాదుపై కాంగ్రెస్ అధిష్టానం స్పందించింది. ఈ వివాదంపై స్పందించిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బీజేపీని తీవ్రంగా విమర్శించారు. "ఒకవేళ వందేమాతరం అంశంపై కేసులు నమోదు చేయాలనుకుంటే ముందుగా మహాత్మా గాంధీపై కూడా కేసు నమోదు చేయాలి" అని ఆయన వ్యాఖ్యానించారు.

**అసలు ఏమిటీ వివాదం?**

ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వందేమాతరం గేయం ఆలాపిస్తున్న సమయంలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఖర్గేల మధ్య సంభాషణలు, సైగలు జరిగాయని, ఇది జాతీయ గేయాన్ని అసమానించడమేనంటూ బీజేపీ నేతలు విమర్శలు గుప్పించారు. అనంతరం ఈ విఘాతంపై సోనియా, రాహుల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే స్పందిస్తూ.. 1937లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (CWC) వందేమాతరంలోని మొదటి రెండు చరణాలను మాత్రమే జాతీయ గేయంగా స్వీకరించాలని నిర్ణయించిందని, ఆ కమిటీ సమావేశానికి మహాత్మా గాంధీ కూడా అధ్యక్షత వహించారని గుర్తుచేశారు. అందువల్ల వందేమాతరం విషయంలో ఫిర్యాదులు చేయాలనుకుంటే, ఆనాడు చారిత్రక నిర్ణయం తీసుకున్న మహాత్మా గాంధీతో పాటు ఇతర స్వాతంత్ర్య సమరయోధులపై కూడా కేసు నమోదు చేయాలని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, జాతీయ ఆర్ఎస్ఎస్ (=ూా) వేదికలపై 'వందేమాతరం' పాడకుండా కేవలం తమ ప్రార్థనలకే ప్రాధాన్యత ఇస్తారని, అలాంటిది బీజేపీ నేతలు కాంగ్రెస్‌కు దేశభక్తి పాఠాలు చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

## కొల్లాపూర్ పాలిటెక్నిక్ కళాశాలకు 70పోస్టులు మంజూరు

**కోడేరు/కొల్లాపూర్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు 70నూతన పోస్టులు మంజూరు అయినట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు, తెలిపారు, బోధన, బోధనేతర సిబ్బందికి పోస్టులు కేటాయింపు, కొల్లాపూర్ విద్యార్థులకు సాంకేతిక విద్యను చేరువ చేయడమే లక్ష్యం కళాశాల నిర్వహణ మరింత సజావుగా సాగెందుకు చర్యలు, విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు, తర్వాలో అన్ని ప్రక్రియలు పూర్తి చేసి కళాశాలను పూర్తి స్థాయి లో అందుబాటులోకి తీసుకొస్తాం పోస్టుల మంజూరుపై విద్యార్థులు, యూవత తల్లిదండ్రులు హర్షం విద్యఅభివృద్ధి చొరవ చూపుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు కు కృతజ్ఞతలు తెలిపిన కొల్లాపూర్ నియోజకవర్గం ప్రజలు,

| Sl. No | Name of the Post | No. of Posts (Year wise) | | | | Scale of Pay |
|---|---|---|---|---|---|---|
| | | 1st Yr. | 2nd Yr. | 3rd Yr. | Total | |
| 1 | Principal | 1 | - | - | 1 | 131400-217100 * |
| 2 | Head of Department (Engg./ Non-Engineering) | 3 | 1 | - | 4 | 131400-217100 * |
| 3 | Lecturers | 7 | 7 | 7 | 21 | 56100-177500 * |
| 4 | Librarian | 1 | - | - | 1 | 56100-177500 * |
| 5 | Physical Director | 1 | - | - | 1 | 56100-177500 * |
| 6 | Administrative Officer | - | 1 | - | 1 | 51320-127310 |
| 7 | Office Superintendent | 1 | - | - | 1 | 42300-115270 |
| 8 | Hostel Manager | 1 | - | - | 1 | 42300-115270 |
| 9 | Senior Instructor | 3 | - | - | 3 | 35720-104430 |
| 10 | Computer Operator | 1 | - | - | 1 | 32810-96890 |
| 11 | Senior Assistant | 1 | 1 | - | 2 | 32810-96890 |
| 12 | Electrician | 1 | - | - | 1 | 31040-92050 |
| 13 | Junior Assistant | 2 | 2 | - | 4 | 24280-72850 |
| 14 | Lab Attender | 5 | 3 | 3 | 11 | 22900-69150 |
| 15 | Office Subordinate | 6 | - | - | 6 | 19000-58850 |
| 16 | Sweeper | 2 | - | - | 2 | 19000-58850 |
| 17 | Sanitary Worker | 1 | - | - | 1 | 19000-58850 |
| 18 | Watchman | 3 | - | - | 3 | 19000-58850 |
| 19 | Head Cook | 1 | - | - | 1 | 20280-62110 |
| 20 | Cook | 2 | - | - | 2 | 19640-60480 |
| 21 | Cleaner cum suppliers | 3 | - | - | 3 | 19640-60480 |
| 22 | Cleaner cum Sweeper | 3 | - | - | 3 | 19000-58850 |
| 23 | Matron | 1 | - | - | 1 | 21580-65570 |
| 24 | Female Nursing Orderly | 1 | - | - | 1 | 19640-60480 |
| 25 | Watchman | 2 | - | - | 2 | 19000-58850 |
| | Total Posts | 53 | 15 | 10 | 78 | |

## కాంగ్రెస్‌లో 'పదవుల' చిచ్చు..

**తాండూరు,ఫ్లాష్ ఇండియా :** అధికార కాంగ్రెస్ లో పదవుల చిచ్చు మొదలైంది. ఇటీవల ఇచ్చిన నామినెటెడ్ పదవులతో పాటు దేవాలయాల చైర్మన్ల విషయంలో తాండూరు నియోజకవర్గంలో ద్వితీయ శ్రేణి నాయకత్వం తీవ్ర అసంతృప్తితో ఉన్నది. తాము ఆశించిన చోట కావాలనే అవకాశం లేకుండా చేశారని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ కీలక నేతలపై ఆరోపణలు చేస్తూ స్థానిక నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణం, మండల స్థాయిలో బలమైన ద్వితీయ శ్రేణి నాయకులు, సీనియర్లు లేకుండా వ్యూహం ప్రకారం పన్నిన పన్నాగమని వాపోతున్నారు. ఇన్నాళ్లు తమను వాడుకొని ఇపుడు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని రగిలిపోతున్నారు. ఏదో ఒకటి రెండు చోట్ల కాదు తాండూరు నియోజకవర్గం వ్యాప్తంగా కాంగ్రెస్ వ్యతిరేఖత రాగమే వినిపిస్తున్నది. జనరల్ పదవులను కూడ ఇతరులకు ఇవ్వడంతో పాటు మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ల ఎంపికలో సైతం పార్టీకి సహకరించిన సీనియర్లకు ఇవ్వకుండా పైసల్ ఇచ్చిన వారికే పదవులు ఇచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.దేవాలయాల చైర్మన్ల ఎంపికలో కూడ రాజకీయం రసవత్తరంగా నడిచింది. పోట్లమహరాజ్ దేవాయలం, నగరేశ్వర దేవాలయం చైర్మన్ల ఎంపికపై తీవ్ర గందరగోళం నెలకొంది. వరుసగా ఒకే కుటుంబం నుంచి కూడ పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టులు ఇవ్వడంతో సీనియర్ కాంగ్రెస్ నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి గెలుపుకు సహకరించిన ఆయన సోదరుడు బుయ్యని శ్రీనివాస్ రెడ్డితో పాటు మిగితా నాయకులు గుర్రుమంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి వచ్చిన నేతలకే అన్ని పదవులు ఇస్తున్నారని, సీనియర్ నేతలకు సరైన న్యాయం జరగడం లేదని పలువురు కాంగ్రెస్ నేతలు వాపోతున్నారు. తాండూరు నియోజకవర్గంలోని ముఖ్య కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లేందుకు సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం. తాండూరు బీఆర్ఎస్ ఇంచార్జిగా ఉండేందుకు తాండూరుకు చెందిన ముఖ్యనేతలు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసినట్లు విశ్వసనీయ సమాచారం. తాజాగా తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తాండూరుకు వస్తే వేలాది మంది స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున స్వాగతం పలుకడంతో కాంగ్రెస్ లో బయం మొదలైంది.

**రాజ్యామేలుతున్న అక్రమాలు...**

తాండూరులో అక్రమాలు రాజ్యమేలుతున్న పట్టించుకునే నాయకులే కరువయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భూములను, స్థలాలను పలువురు ఆక్రమణలకు గురిచేస్తున్న అధికార పార్టీ బలం ఉండడంతోనే ఎవరు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమ ఇసుక రవాణా కూడ జోరుగానే నడుస్తుంది. ఎర్రమట్టి త్రవ్వకాలపై కూడ ఎవరు నోరుమెదపడం లేదు. డబుల్ బెడ్ రూం ఇండ్లపై కూడ ప్రజలు అసంతృప్తిగానే ఉన్నారు. ఇండ్లు ఇప్పిస్తామని పైసల్ తీసుకున్న కొందరు వ్యక్తులు ల్యాటరీ పద్ధతిలో ఇండ్లను కేటాయించడంతో ఇచ్చిన వారికి ఇంకా డబ్బులు తిరిగి ఇవ్వలేదన్నా విమర్శలు కూడ ఉన్నాయి. ముఖ్యంగా బీఆర్ఎస్ పాలనలో తీసుకువచ్చిన చిలుక వాగు పనుల విషయంలో కూడ ప్రముకులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. నాలా సైజును చాలా వరకు తగ్గించి నిర్మాణం పనులు చేపట్టినట్లు చెబుతున్నారు. మున్సిపల్‌లో బిల్లుల్లో తీవ్ర అన్యాయం జరుగుతుందని ప్రతిపక్ష నేతలతో పాటు పలువురు కౌన్సిలర్లు విమర్శిస్తున్నారు. సాక్షాలతో బయట పెట్టేందుకు కొందరు ముఖ్య నేతలు సిద్దమైనట్లు తెలిసింది.

## తాండూరులో కల్తీ కోవా కలకలం..




**తాండూరు,ఫ్లాష్ ఇండియా :** తాండూరు పట్టణ కేంద్రంలో కల్తీ కోవా వ్యవహారం కలకలం రేపింది. రూ.30 వేల విలువైన కల్తీ కోవా, కల్తీ కళాఖాన్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. జహీరాబాద్ నుంచి తాండూరు పట్టణానికి తీసుకువచ్చి విక్రయిస్తున్న కల్తీ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. పక్కా సమాచారంతో దాడి చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిందితుడు రూపారామ్‌ను పట్టుకుని పట్టణ పోలీసులకు అప్పగించారు. 160 కిలోల కల్తీ కోవా, 14 కిలోల కల్తీ కళాఖాన్‌ను సీజ్ చేశారు. ఈ కల్తీ వ్యవహారంపై మరింత లోతుగా విచారణ జరిపి, కల్తీకి చెక్ పెట్టే దిశగా చర్యలు తీసుకుంటామని పట్టణ పోలీసులు తెలిపారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా
మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# మేకవన్నె పులిలా రేవంత్ రెడ్డి

## మేము అధికారంలోకి వస్తే కుటుంబానికి ఎకరం భూమి..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే 'భూ లక్ష్మి పథకం' కింద భూమి లేని పేదలకు ఎకరం చొప్పున ఇస్తామని కవిత సంచలన ప్రకటన చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భూమి అంటే కేవలం లావాదేవీలే కావొచ్చు కానీ పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు భూమీ, అడవి అంటే పంచప్రాణాలు అని రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు జరిగినా ముందుగా తీసుకుంటున్నవి అసైండ్ భూములేనని మండిపడ్డారు. రాష్ట్రంలో భూమి పంపిణీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇవాళ బంజారాహిల్స్ లోని టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కవిత.. రేవంత్ రెడ్డి తమ్ముళ్లు భూ దొంగలు అని అనగనగా ఒక రాజు ఏడుగురు కొడుకులు అన్నట్లుగా రేవంత్ రెడ్డి సోదరుల బూదోపిడీ సాగుతోందని, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి రాక్షస పాలన సాగుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల పాలన సాగుతోందని ఇంత మంది రాజ్యాంగేతర శక్తుల దోపిడీ ఏంటని ప్రశ్నించారు. 30 వేల అసైండ్ భూములను ఈ ప్రభుత్వం లాగేసుకుందని ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉండే మేనిఫెస్టోలో చెప్పినట్లుగా పేదల అసెండ్ భూములపై వారికి యాజమాన్య హక్కులు కల్పించాలని చాలెంజ్ చేశారు.

**మేకవన్నె పులిలా రేవంత్ రెడ్డి:**

ప్రొఫెసర్ జయంతి సందర్భంగా తెలంగాణలో సామాజిక న్యాయం సాధించాలనే సంకల్పం తీసుకోగానే గత 31 నెలల్లో ఏనాడూ సామాజిక న్యాయం పదం ఉచ్చరించని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సామాజిక న్యాయం గురించి మాట్లాడుతున్నారన్నారు. సామాజిక అన్యాయం అనబోయి సామాజిక న్యాయం అన్నారని రాష్ట్ర ప్రజలు రేవంత్ రెడ్డి మాటలను నమ్మవద్దన్నారు. రేవంత్ రెడ్డి కేబినెట్ లోనే సామాజిక న్యాయం లేదని, పదవులు ఇచ్చే అవకాశం ఉండి కూడా ఎస్సీ ఎస్టీ, బీసీలు ఎందుకు న్యాయం చేయడం లేదన్నారు. రేవంత్ రెడ్డి మేకవన్నెపులిలాంటి వాడని విమర్శించారు.

**చెప్పేంది సామాజిక న్యాయం చేసేది ఆటవిక న్యాయం:**

ప్రభుత్వ సలహాదారుల నియామకాల్లో బడుగు బలహీన వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. సలహాదారులుగా ఒకే రోజు శివధర్ రెడ్డి, వీహెచ్ ను నియమిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఇందులో బీసీ బిడ్డ వీహెచ్ జీతం శివధర్ రెడ్డి కంటే ఎందుకు తక్కువ ఉందని ప్రశ్నించారు. ఆర్టీఐ కమిషనర్లో ఒక్క బీసీ లేదన్నారు. ఆర్టీఐ కమిషనర్ భార్యకు సినిమాలతో సంబంధం లేదని ఆమెను చిత్రపురి కాలనీ మెంబర్‌గా నియమించారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి చెప్పేంది సామాజిక న్యాయం చేసేది ఆటవిక న్యాయం అని ఆరోపించారు.

లంబాడా ప్రాతినిధ్యం లేని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ఏకైక కేబినెట్ రేవంత్ రెడ్డిదేనన్నారు. కాంగ్రెస్ పార్టీలో అగ్రవర్ణాలకు ఒక న్యాయం పేదలకు మరో న్యాయం కొనసాగుతోందన్నారు.



## 22ఏపై మంత్రి కోమటిరెడ్డి తీవ్ర వ్యాఖ్యలు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా:** రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ల శాఖలో నిషేధిత భూముల (22ఏ) జాబితా వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది. తాజాగా ఇదే అంశంపై రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇవాళ ఆయన నగరంలో మీడియాతో మాట్లాడుతూ.. 22ఏ జాబితా లొసుగుల వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని, ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకే కొందరు కావాలని ఈ వివాదాన్ని తెరపైకి తెచ్చారని ఆరోపించారు. 22ఏ జాబితా అంశంపై ప్రభుత్వం త్వరలోనే సమగ్ర విచారణ జరిపిస్తుందని అన్నారు. ఇందులో ఎవరు ఉన్నా, ఎంతటి వారైనా సరే కఠిన చర్యలు తీసుకోవడం ఖాయమని కామెంట్ చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సుపరిపాలనను అందిస్తున్న తమ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావాలనే దురుద్దేశంతోనే ఈ తరహా కుట్రలకు పాల్పడుతున్నారని ఫైర్ అయ్యారు. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో కీలక బాధ్యతల్లో పనిచేసిన కొందరు అధికారుల పాత్ర దీని వెనుక ఉండి ఉండవచ్చని తాను బలంగా అనుమానిస్తున్నానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు.

**రాష్ట్రంలో హాట్‌టాపిక్‌గా 22ఏ..**

కాగా, రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది ఎకరాల భూములను రాత్రికి రాత్రే 22ఏ అంటే రెవెన్యూ భాషలో నిషేధిత భూముల జాబితాలో చేర్చడంపై భూ యజమానులు, ప్లాట్ల ఓనర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండానే తమ భూములను నిషేధిత జాబితాలో పెట్టడంతో దస్తావేజుల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

# నేనే సారీ చెప్పా..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా:** 22ఏతో ప్రైవేట్ ఆస్తులకు ఇబ్బంది కలిగిన మాట నిజమేనని అయితే ఈ వివాదాన్ని దాచిపెట్టాలనో, ప్రజలను మభ్యపెట్టాలనో నేను కానీ మా ప్రభుత్వం కానీ అనుకోవడం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. జరిగిన వాస్తవం ఏంటో ప్రజలకు నిన్నే వివరించామని ఈ వివాదంలో జరిగిన పొరపాటును భేషరతుగా సరిద్దితామని చెప్పామని ఇప్పటికే సరిదిద్దే ప్రయత్నం మొదలుపెట్టామన్నారు. ఇవాళ ఓ న్యూస్ చానల్ తో మాట్లాడిన పొంగులేటి.. ప్రజల ఆస్తులను 22ఏలో ఉద్దేశపూర్వకంగానే పెట్టి వాటిని రిలీజ్ చేయడానికి డబ్బులు వసూలు చేయడానికే ఈ తతంగాన్ని నడుపుతున్నారంటూ మాజీ మంత్రి హరీశ్ రావు చేసిన ఆరోపణలపై మంత్రి స్పందించారు. హరీశ్ రావు కాదు ఆయన అబద్దాలరావుగా మారారని ఎద్దేవా చేశారు. పొరపాటు జరిగిందని నేనే స్వయంగా ప్రెస్ మీట్ పెట్టి చెప్పానని, 22ఏ లో కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు హరీశ్ రావు తీరు ఉందని విమర్శించారు.

**మీకు మాకు అదే తేడా:**

ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి, నిజాయితీ, నిబద్ధత ఉందని అందువల్లే తప్పు జరిగితే అంగీకరించామన్నారు. మీకు మాదిరిగా దబాయించడం లేదని, ధరణిలో మీరు ఆడిన ఆటలు, అబద్ధాలెన్నో హరీశ్ రావు గుండెల మీద చెయి వేసుకుని చెప్పాలన్నారు. ధరణి మూలంగా ప్రజలు ఆత్మహత్యలు చేసుకుంటే స్పందించని మీరా మా గురించి మాట్లాడేదన్నారు. ప్రక్షాళన చేస్తున్న క్రమంలో జరిగిన పొరపాటుకు అధికారుల పక్షాన క్షమాపణ కూడా అడిగానని ఏనాడైనా మీరు క్షమాపణ కోరారా అది మీ నిబద్ధత అన్నారు. సామాన్య ప్రజలకు ఇబ్బంది పెట్టాలనో కారుకూతలు కూరే వారికి సమాధనం చెప్పాలలో చర్యలు తీసుకోవడం లేదన్నారు. 1998 నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ఇప్పుడు తెలంగాణ ఏర్పడి తర్వాత కూడా ప్రభుత్వ జీవోలు, మెమోలతో హక్కులు లభించిన భూములకు సంబంధించిన కాపీలు ఆన్‌లైన్ లో అప్‌లోడ్ కాలేదని, ఆ విషయం గ్రహించకుండా హైకోర్టు ఆదేశాలతో 22ఏ జాబితాను వివిధ జిల్లాల కలెక్టర్లు ఆన్ లైన్ లో అప్ లోడ్ చేయడం కారణంగా నిషేధిత భూముల సమస్య వచ్చిందని తెలిపారు. దీన్ని గ్రహించి యుద్ధప్రాతిపాదికన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

**ఇవాళ కమిటీ..**

హైదరాబాద్ కోర్ ఏరియాలో న్యాయబద్ధంగా ఉన్న 22ఏ బాధితులకు వారి ఆస్తులకు పూర్తి భద్రత, రక్షణ మా ప్రభుత్వానిదన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా ప్రభుత్వ భూములను వారి తొత్తులకు పంచిపెట్టడం లేదన్నారు. ఆనాడు ధరణి మాదిరిగా మొఖం చాటేయడం లేదని నాడు ధరణితో సామాన్య ప్రజలు ఇబప్బంది పడితే ఎలాంటి ఇబ్బంది లేదని బుకాయించడం లేదన్నారు. ప్రజలకు సంబంధించిన ప్రైవేట్ ఆస్తుల విషయంలో మిస్టెక్ జరిగిన వాట వాస్తవం అని అయితే వీటిని ఈ నెలాఖరంలోపే పరిష్కరించాలని ఉన్నతాధికారులకు కఠిన ఆదేశాలు ఇచ్చామన్నారు. రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ లోకేశ్, రాజీవ్ గాంధీతో పాటు మరో ముగ్గురితో ఇవాళ కమిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కమిటీ రాబోయే 15 రోజులపాటు ప్రతి రోజు హైదరాబాద్ కోర్ ప్రాంతంతో పాటు రాష్ట్రంలోని మిగిలిన 22ఏతో నిజమైన హక్కుదారుల సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తామన్నారు. ఎక్కడైనా రిజిస్ట్రేషన్ స్లాట్స్ షార్ట్ ఫాల్ అయితే వాటిని పొడిగించాలని అధికారులకు ఆదేశించామన్నారు.

# పెట్టుబడిదారులకు స్వర్గధామం తెలంగాణ..




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్రం అన్ని రకాల పెట్టుబడిదారులను ప్రోత్సహించే స్వర్గధామమని, క్లీన్ ఎనర్జీ రంగానికి నిలయంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్‌లోని హైటెక్స్, నోవాటెల్ లో 2 రోజుల పాటు జరగనున్న 'ఇండియా ఎనర్జీ సమ్మిట్ & ఎక్స్ పో 2026'ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సమ్మిట్ కు విచ్చేసిన పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు మరియు సాంకేతిక నిపుణులను ఉద్దేశించి డిప్యూటీ సీఎం ప్రసంగించారు. "పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలు, సీఈఓలు.. మీ అందరినీ ఆహ్వానిస్తున్నాను, రండి. తెలంగాణ అన్ని రకాల పెట్టుబడిదారులను ప్రోత్సహించే రాష్ట్రం, ఇది పెట్టుబడిదారులకు ఒక స్వర్గధామం. మన సమృద్ధిని పంచుకోవడానికి మరియు కలిసి ఎదగడానికి మిమ్మల్ని పూర్ణహృదయంతో ఆహ్వానించడానికి ఈ రాష్ట్రం సిద్ధంగా ఉంది" అని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఇంధన రంగంలో మార్పు అనేది కేవలం విద్యుత్ ఉత్పత్తి మూలాన్ని మార్చడం మాత్రమే కాదని, అది సమగ్ర ఆర్థిక వ్యవస్థ నిర్మాణాన్నే మార్చే విప్లవాత్మక ప్రక్రియ అని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణను కేవలం స్వచ్ఛమైన ఇంధనాన్ని వినియోగించే రాష్ట్రంగా మాత్రమే కాకుండా, ప్రపంచ క్లీన్ ఎనర్జీ రంగానికి అవసరమైన సాంకేతికతలను తయారు చేసే ప్రధాన కేంద్రంగా నిలపాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుంటూనే, పర్యావరణ పరిరక్షణను సాధించేలా ప్రణాళికలు రూపొందించామని డిప్యూటీ సీఎం వివరించారు. ఇందులో భాగంగా 2030 నాటికి 20,000 ఎండబ్ల్యూ, 2035 నాటికి 26,000 ఎండబ్ల్యూ కు పైగా సోలార్ విద్యుత్ సామర్థ్యాన్ని పెంచనున్నట్లు తెలిపారు. అలాగే పునరుత్పాదక ఇంధనానికి అత్యంత కీలకమైన 'విద్యుత్ నిల్వ' సామర్థ్యాన్ని కూడా భారీగా విస్తరిస్తున్నామని చెప్పారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా 2030 నాటికి 3,800 ఎండబ్ల్యూ, 2035 నాటికి 8,000 ఎండబ్ల్యూ నిల్వ వ్యవస్థను అందుబాటులోకి తెస్తామన్నారు. హైదరాబాద్‌లోని ఐటీ, ఏఐ నైపుణ్యాలను ఉపయోగించి భవిష్యత్తు విద్యుత్ గ్రిడ్‌ను డిజిటల్ నెట్‌వర్క్‌గా మారుస్తున్నామని ఆయన పేర్కొన్నారు. 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో ఏర్పాటు చేయబోయే ఏఐ డేటా సెంటర్ కోసం ప్రత్యేకంగా 100 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్లాంట్‌ను అనుసంధానిస్తున్నట్లు వెల్లడించారు. వీటితో పాటు 2030 నాటికి ఏటా 4 లక్షల టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, 2035 నాటికి 12,000 ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సోలార్, విండ్, బ్యాటరీ ఉత్పత్తులను ఇక్కడే తయారు చేసే కంపెనీలకు మూలధన సాయం, ఎస్‌జీఎస్‌టీ రీయింబర్స్‌మెంట్, విద్యుత్ సుంకం మినహాయింపులతో పాటు టీజీ-ఐపాస్ ద్వారా వేగవంతమైన అనుమతులు ఇస్తున్నామని వివరించారు. ప్రభుత్వం, ప్రైవేట్ భాగస్వామ్యంతోనే ఈ ఇంధన విప్లవం సాధ్యమవుతుందని, తెలంగాణతో కలిసి నడవాలని పారిశ్రామికవేత్తలకు డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు. కార్యక్రమం అనంతరం ఏర్పాటుచేసిన వివిధ స్టాల్స్ ను ఆయన సందర్శించారు. డిప్యూటీ సీఎం వెంట స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్ తదితరులు ఉన్నారు.

## రూ.8,452 కోట్లతో 'పీఎం కేర్ ఫండ్'..

**న్యూఢిల్లీ:** దేశంలో సంచలనం సృష్టించిన 'పీఎం కేర్ ఫండ్' ఆడిట్ వివరాలను కేంద్ర ప్రభుత్వం వెబ్‌సైట్‌లో అందుబాటులో పెట్టింది. కోవిడ్-19 మహమ్మారి ఎమర్జెన్సీ పరిస్థితులు, విపత్తుల్లో ప్రజలను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన ఈ పబ్లిక్ చారిటబుల్ ట్రస్ట్ ఖాతాల్లో ప్రస్తుతం రూ.8,452.07 కోట్ల బ్యాలెన్స్ ఉన్నట్లుగా అధికారిక నివేదికలో పేర్కొన్నారు.

**ఫిక్స్‌డ్ డిపాజిట్లపైనే భారీగా వడ్డీ రాబడి..**

అయితే, తాజా ఆడిట్ లెక్కల ప్రకారం.. పీఎం కేర్ ఫండ్‌లో ఉన్న నిధులను అత్యధికంగా బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లలో భద్రపరిచారు. నిధిలోని దాదాపు 93 శాతం సొమ్ము, అంటే రూ.7,846.65 కోట్లు వివిధ బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలోనే ఉంది. కేవలం ఈ ఎఫ్‌డీలపైనే ఏడాదికి రూ.469.38 కోట్లు వడ్డీ రూపంలో నిధికి అదనపు ఆదాయం సమకూరింది. దేశీయ విరాళాల రూపంలో రూ.479.04 కోట్లు రాగా, విదేశీ విరాళాల ద్వారా రూ.92.83 లక్షలు మాత్రమే వచ్చాయి. కాగా, 2020 మార్చిలో కరోనా విపత్తు సమయంలో పీఎం మోడీ పిలుపు మేరకు 'పీఎం కేర్ ఫండ్' ప్రారంభమైన సంగతి తెలిసిందే. భవిష్యత్తులో వచ్చే ఎలాంటి వైద్య, ఆరోగ్యం, ప్రకృతి విపత్తుల అత్యవసర సమయాల్లోనైనా తక్షణమే వినియోగించేందుకు ఈ నిధిని నిల్వ ఉంచినట్లుగా కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఈ ఫండ్ నుంచి కరోనా కాలంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లల సంక్షేమం కోసం చేపట్టిన 'పీఎం కేర్స్ ఫర్ చిల్డ్రన్' వంటి పథకాలకు సాయం అందిస్తున్నారు.

## 30 నెలలుగా తులం బంగారం హామీ ఏమైంది?




**సత్తుపల్లి,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి వాటిని అటకెక్కించిందని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య విమర్శించారు. రాష్ట్ర బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల నిలుపుదలకు నిరసనగా మంగళవారం పెనుబల్లి, వేంసూరు మండలాల ముఖ్య నాయకులతో కలిసి సత్తుపల్లి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సండ్ర వెంకట వీరయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం 420 అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి వాటిని విస్మరించిందన్నారు. గత 30 నెలలుగా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులతో పాటు తులం బంగారం ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. 30 నెలలుగా తులం బంగారం ఎందుకు ఇవ్వలేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతు బీమాకు రామ్.. రామ్ పలికిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని విమర్శించారు. 40 వేల క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టులో ఒకట్రెండు పిల్లర్లు కుంగితే లేనిపోని ప్రచారం చేసిన కాంగ్రెస్ నాయకులు.. సీతారామ ప్రాజెక్టుకు 15 వేల క్యూసెక్కుల నీటిని అందించే కాలువలు దెబ్బతినడంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు కేసీఆర్ ఆలోచన నుంచి పుట్టినవేనని సండ్ర పేర్కొన్నారు. రూ.50 వేలతో ప్రారంభించిన ఈ పథకాల సాయాన్ని దశలవారీగా రూ.1.10 లక్షలకు పెంచిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. రాష్ట్రంలో ఈ పథకాలను గత 13 ఏళ్లుగా అమలు చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. పేదలకు అందించే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని, కోర్టులో ఉన్న కేసులను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. పథకాల నిలుపుదలకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని, కోర్టులో కౌంటర్ దాఖలు చేయకపోవడంతోనే పథకాల నిలుపుదలకు ఆదేశాలు వచ్చాయని ఆరోపించారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు చెక్కిలాల మోహన్‌రావు, ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ దొడ్డ వెంకట కృష్ణారెడ్డి, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ శీలపురెడ్డి హరికృష్ణరెడ్డి, మందపాటి వాసురెడ్డి, పట్టణ అధ్యక్షుడు మోనార్క్ గ్రఫీ, మల్లూరు అంకమరాజు, మాజీ వార్డు కౌన్సిలర్లు, చాంద్‌భాషా, అద్దంకి అనిల్, వీరపనేని బాబీ, కోటగిరి సుధాకర్‌బాబు, మందపాటి చెన్నారెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ మందపాటి వెంకటరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మంత్రుల పర్యటనకు సర్వం సిద్ధం..



**మంథని,ఫ్లాష్ ఇండియా :** పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గంలో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో పాటు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బుధవారం పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. మంథని పట్టణం గంగాపురి వద్ద న్యాక్ స్కిల్ డెవలప్‌మెంట్ బిల్డింగ్‌తో పాటు, పాత పెట్రోల్ బంక్ వద్ద నాలుగు మండలాల్లోని 9 గ్రామాలకు సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన 9 వైకుంఠ రథాలను సర్పంచులు, ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రులు ప్రారంభించనున్నారు. మంథని బస్ డిపో వద్ద రూ.164.64 కోట్లతో పలు అభివృద్ధి పనులకు, బ్రిడ్జి రోడ్డు నుంచి బస్ డిపో వరకు వెడల్పు డ్రెయిన్ నిర్మాణానికి రూ.15 కోట్లు, సెంట్రల్ లైటింగ్‌కు రూ.1.20 కోట్లు, గాంధీచౌక్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్‌కు రూ.59 లక్షలు, అంబేద్కర్ చౌక్ నుంచి ముత్యాలమ్మ ఆలయం వరకు రోడ్డు విస్తరణకు రూ.35 లక్షలు, క్యాంప్ ఆఫీస్ రోడ్డుకు రూ.50 లక్షలు, ఇతర వార్డుల్లో రోడ్ల పనులకు రూ.9 కోట్లతో శంకుస్థాపనలు చేయనున్నారు. మంథని డిపో నుంచి డిగ్రీ కళాశాల వరకు రూ.21 కోట్ల సీఎఆర్ఎఫ్ నిధులతో, మంథని డిపో నుంచి గోదావరి వరకు 2 కిలోమీటర్ల నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణానికి రూ.22 కోట్లతో పనులు ప్రారంభించనున్నారు. సూరయ్యపల్లి నుంచి కాకర్లపల్లి మీదుగా సీతంపేట వరకు 10.8 కిలోమీటర్ల రోడ్డు విస్తరణకు రూ.29.94 కోట్లు, గుంజపడుగు నుంచి ఉప్పట్ల మీదుగా విలోచవరం వరకు 10.9 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.8.78 కోట్లు, కూనారం నుంచి ముత్తారం వరకు 18 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.36.28 కోట్ల నిధులతో శంకుస్థాపనలు చేయనున్నారు. మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగే బహిరంగ సభలో నాలుగు మండలాల ప్రజలకు రేషన్ (స్మార్ట్) కార్డులు, కల్యాణలక్ష్మి/షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులు, మైనార్టీలకు కుట్టుమిషన్లు, మహిళా స్వశక్తి సంఘాలకు చెక్కులను మంత్రులు పంపిణీ చేయనున్నారు.

## సంపాదకీయం




# ఆలోచనలతో యుద్ధం ఎందుకు?

మావోయిస్టుల సాయుధ పోరాటం దాదాపు ముగింపు దశకు చేరుకుందని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించడం దేశ భద్రతా దృష్ట్యా కీలకమైన పరిణామం. దశాబ్దాలుగా హింస, భయం, ఆయుధ పోరాటం, అభివృద్ధికి ఆటంకంగా నిలిచిన మావోయిస్టు ప్రభావం క్రమంగా తగ్గిపోవడం స్వాగతించదగిన పరిణామమే. అయితే ఇదే సందర్భంలో ప్రధాని ప్రస్తావించిన 'దిమాగీ నక్సల్స్' అనే పదం కొత్త రాజకీయ, సామాజిక చర్చకు తెరలేపింది. సాయుధ నక్సలిజాన్ని ఎదుర్కోవడం ఒక విషయం అయితే, ఒక భావజాలాన్ని నమ్మేవారిని, ప్రభుత్వ విధానాలను ప్రశ్నించేవారిని, అసమ్మతి వ్యక్తం చేసే మేధావులను అదే గాటన కట్టడం మరో విషయం. ఈ రెండింటి మధ్య తేడాను స్పష్టంగా గుర్తించడం ప్రజాస్వామ్యానికి అత్యంత అవసరం.సాయుధ తిరుగుబాటుకు, చట్టబద్ధమైన అసమ్మతికి ఒకే కొలమానం ఉండకూడదు. ఆయుధాలు పట్టుకుని హింసకు పాల్పడే వ్యక్తులు, భద్రతా బలగాలపై దాడులు చేసే సంస్థలు, ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే చర్యలు ప్రజాస్వామ్య వ్యవస్థలో సమర్థించలేనివి. అలాంటి హింసను అరికట్టడం ప్రభుత్వ బాధ్యత. కానీ ఒక విద్యార్థి ప్రభుత్వ విధానాన్ని ప్రశ్నిస్తే, ఒక మేధావి పాలకుల నిర్ణయాలను విమర్శిస్తే, ఒక పౌర సంఘం మానవ హక్కుల ఉల్లంఘనలను ఎత్తిచూపితే, ఒక గిరిజన సమూహం తన భూమి, అటవీ హక్కుల కోసం పోరాడితే వారిని సాయుధ తిరుగుబాటుదారులతో సమానంగా చూడటం ఎంతవరకు సమంజసం అన్న ప్రశ్న తప్పక తలెత్తుతుంది.ప్రజాస్వామ్యానికి అసమ్మతి శత్రువు కాదు. అసమ్మతే ప్రజాస్వామ్యానికి ప్రాణం. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయాన్ని ప్రజలు అంగీకరించాల్సిన అవసరం లేదు. పాలకుల విధానాల్లో లోపాలుంటే వాటిని ప్రశ్నించే హక్కు పౌరులకు ఉంటుంది. ఎన్నికలు పూర్తయిన తర్వాత ప్రజాస్వామ్యం ముగిసిపోదు. ఎన్నికల మధ్యకాలంలో మీడియా, ప్రతిపక్షాలు, పౌర సమాజం, విద్యార్థులు, మేధావులు, సామాజిక సంస్థలు అధికారాన్ని ప్రశ్నించడం ప్రజాస్వామ్య ప్రక్రియలో అంతర్భాగం.ఇక్కడ ఒక కీలకమైన విషయాన్ని గుర్తించాలి. ప్రభుత్వాన్ని వ్యతిరేకించడం దేశాన్ని వ్యతిరేకించడం కాదు. ఒక ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టడం అంటే రాజ్యాంగాన్ని తిరస్కరించడం కాదు. ఒక చట్టంపై నిరసన వ్యక్తం చేయడం దేశద్రోహం కాదు. ప్రభుత్వం, దేశం రెండూ ఒకటి కావు. ప్రభుత్వం తాత్కాలికమైన రాజకీయ వ్యవస్థ; దేశం మాత్రం శాశ్వతమైన భావన. ఈ తేడా చెరిగిపోయినప్పుడు పాలకులను ప్రశ్నించడం కూడా దేశ వ్యతిరేక చర్యగా చిత్రీకరించే ప్రమాదం ఏర్పడుతుంది.భారతదేశం ఒకే భావజాలంతో నిర్మితమైన దేశం కాదు. ఈ నేలపై జాతీయవాదం, సామాజికవాదం, మార్క్సిజం, అంబేద్కరిజం, గాంధేయవాదం, ఉదారవాదం, వామపక్షం, దక్షిణపక్షం, ప్రాంతీయవాదం, దళిత ఉద్యమాలు, స్త్రీవాద ఉద్యమాలు వంటి అనేక ఆలోచనా ప్రవాహాలు ఉన్నాయి. కొన్ని పరస్పరం విరుద్ధమైనవే. అయినప్పటికీ అవి భారత ప్రజాస్వామ్యంలో తమదైన స్థానం సంపాదించుకున్నాయి. ఒక భావజాలం నచ్చకపోతే దానిని విమర్శించవచ్చు. ప్రజల్లోకి వెళ్లి దాని లోపాలను వివరించవచ్చు. ఎన్నికల్లో దానికి వ్యతిరేకంగా ప్రచారం చేయవచ్చు. కానీ ఒక ఆలోచనను పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యం ప్రజాస్వామ్యానికి ఆరోగ్యకరం కాదు.భావజాలాన్ని ఎదుర్కొనే అత్యంత శక్తివంతమైన ఆయుధం మరో మెరుగైన భావజాలమే. ఒక సిద్ధాంతం దేశానికి ప్రమాదకరమని భావిస్తే, దాని ప్రమాదాలను ప్రజలకు వివరించాలి. దానికి ప్రత్యామ్నాయ ఆలోచనను అందించాలి. ప్రజల తీర్పును కోరాలి. బలప్రయోగం, నిషేధాలు, ముద్రలు మాత్రమే ఒక ఆలోచనను శాశ్వతంగా అంతం చేయలేవు. ఒక భావజాలానికి ప్రజల్లో మద్దతు ఉంటే అది కాలానుగుణంగా మారుతుంది, కొత్త రూపాలు సంతరించుకుంటుంది. మద్దతు లేకపోతే అది సహజంగానే బలహీనపడుతుంది.భారత రాజకీయ చరిత్రను పరిశీలించినా ఇదే విషయం కనిపిస్తుంది. ఆర్ఎస్ఎస్ వంటి సంస్థలు దశాబ్దాలుగా సామాజిక, సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు, విద్యా సంస్థలు, ప్రచురణలు, వివిధ సంస్థాగత వేదికల ద్వారా తమ భావజాలాన్ని సమాజంలోకి తీసుకెళ్లాయి. అదే విధంగా వామపక్ష, కమ్యూనిస్టు ఉద్యమాలు కార్మిక సంఘాలు, రైతు ఉద్యమాలు, విద్యార్థి సంస్థలు, సాహిత్య, సాంస్కృతిక వేదికల ద్వారా తమ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాయి. అంబేద్కర్ భావజాలం సామాజిక న్యాయం, సమానత్వం, కుల వివక్ష వ్యతిరేక పోరాటాల ద్వారా విస్తరించింది. ఒక భావజాలం బలపడటానికి ప్రజల్లో స్పందన అవసరం; ప్రభుత్వ అనుమతి మాత్రమే దానికి జీవం పోయదు.ఈ నేపథ్యంలో 'దిమాగీ నక్సల్స్' అనే పదానికి స్పష్టమైన నిర్వచనం అవసరం. వారు ఎవరు? మావోయిస్టుల సాయుధ పోరాటానికి మద్దతు ఇచ్చేవారా? లేక ప్రభుత్వ విధానాలను విమర్శించే మేధావులా? విశ్వవిద్యాలయాల్లో ప్రశ్నలు అడిగే విద్యార్థులా? మానవ హక్కులపై మాట్లాడేవారా? భూసేకరణను వ్యతిరేకించేవారా? అటవీ హక్కుల కోసం పోరాడేవారా? ఒక స్పష్టమైన నిర్వచనం లేకుండా ఇలాంటి పదాలు రాజకీయ ముద్రలుగా మారే ప్రమాదం ఉంది.'ఏకాకిని చేయాలి' అనే పిలుపు కూడా మరింత జాగ్రత్తగా చూడాల్సిన అంశం. ప్రజాస్వామ్యంలో ఒక భావజాలాన్ని రాజకీయంగా ఓడించవచ్చు. దాని విధానాలను ప్రజలు తిరస్కరించేలా చేయవచ్చు. కానీ సామాజిక బహిష్కరణ, అభిప్రాయ స్వేచ్ఛను అణచివేయడం, ప్రశ్నించే హక్కును పరిమితం చేయడం వంటి చర్యలకు తావు ఉండకూడదు. నేడు ఒకరిని 'దిమాగీ నక్సల్' అని పిలిస్తే, రేపు మరొకరిని 'దేశ వ్యతిరేకి', ఇంకొకరిని 'అభివృద్ధి వ్యతిరేకి' అని ముద్ర వేయడం సులభమవుతుంది. చివరికి ప్రశ్నించని సమాజం మాత్రమే మిగిలే ప్రమాదం ఉంటుంది.అయితే మరోవైపు, సాయుధ మావోయిజాన్ని, హింసాత్మక తీవ్రవాదాన్ని భావ ప్రకటనా స్వేచ్ఛ పేరుతో సమర్థించలేం. ప్రజలపై దాడులు, భద్రతా బలగులపై హింస, బాంబు దాడులు, హత్యలు వంటి చర్యలు చట్టపరమైన నేరాలు. వాటిని అరికట్టడం ప్రభుత్వ కర్తవ్యం. కానీ హింసాత్మక చర్యలకు పాల్పడేవారిని, చట్టబద్ధంగా అసమ్మతి వ్యక్తం చేసేవారిని వేరు చేయడం కూడా అంతే ముఖ్యమైన ప్రభుత్వ బాధ్యత.భారతదేశ బలం దాని భిన్నత్వంలో ఉంది. ఎన్నో భాషలు, మతాలు, సంస్కృతులు, కులాలు, ప్రాంతాలు, రాజకీయ సిద్ధాంతాలు ఉన్నప్పటికీ ఒక రాజ్యాంగం కింద ప్రజలు కలిసి జీవించడం భారత ప్రజాస్వామ్య ప్రత్యేకత. ఈ వైవిధ్యాన్ని కాపాడాలంటే భిన్నమైన ఆలోచనలకు కూడా స్థానం ఉండాలి.అందుకే సాయుధ నక్సలిజం తగ్గిపోవడం దేశానికి శుభపరిణామమే అయినా, దానితో పాటు అసమ్మతి కూడా తగ్గిపోవాలని భావించడం మాత్రం ప్రమాదకరం. తుపాకీని ఎదుర్కోవడానికి చట్టం అవసరం; ఆలోచనను ఎదుర్కోవడానికి ఆలోచనే అవసరం. ప్రజాస్వామ్యంలో ఒక భావజాలాన్ని నిర్మూలించడం కంటే, దాని కంటే మెరుగైన ఆలోచనను ప్రజల ముందుంచి ప్రజల తీర్పు పొందడం శాశ్వతమైన మార్గం.చివరికి దేశ భద్రతను కాపాడటం ఎంత ముఖ్యమో, ప్రజాస్వామ్య స్వేచ్ఛను కాపాడటం కూడా అంతే ముఖ్యం. ప్రశ్నించే హక్కును కాపాడినప్పుడే ప్రభుత్వం జవాబుదారీగా ఉంటుంది. అసమ్మతిని గౌరవించినప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుంది. అందువల్ల దేశానికి అసలు ముప్పు భిన్నమైన ఆలోచనల్లో ఉందా? లేక భిన్నంగా ఆలోచించడానికి భయపడే సమాజంలో ఉందా? అనే ప్రశ్నను ప్రతి ప్రజాస్వామ్య సమాజం తనను తాను అడగాల్సిన సమయం ఇదే.

# పాపన్న పోరాటం..

## తెలంగాణ ఆత్మగౌరవానికి చారిత్రక ప్రతీక

తెలంగాణ చరిత్ర అనేది కేవలం రాజులు, రాజ్యాలు, కోటలు, యుద్ధాల చరిత్ర మాత్రమే కాదు. ఈ నేల చరిత్రలో సామాన్య ప్రజల జీవన పోరాటాలు, అణగారిన వర్గాల ప్రతిఘటనలు, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమాలు కూడా అంతే ముఖ్యమైన భాగం. అధికార కేంద్రాలకు దూరంగా ఉన్న వర్గాల నుంచి నాయకులు పుట్టుకొచ్చి, తమ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం పోరాడిన సందర్భాలు తెలంగాణ చరిత్రలో ఎన్నో ఉన్నాయి. అలాంటి చరిత్రలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ప్రస్థానం అత్యంత ప్రత్యేకమైనది.సుమారు మూడున్నర శతాబ్దాల క్రితం సామాజిక అసమానతలు, దోపిడీ, ఆధిపత్యం, అధికార కేంద్రీకరణకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పోరాటం సాగించిన పాపన్న కేవలం ఒక యోధుడు కాదు. ఆయన ఒక సామాజిక తిరుగుబాటు ప్రతీక. సామాన్య కుటుంబంలో పుట్టి, తన చుట్టూ ఉన్న సామాజిక వాస్తవాలను అర్థం చేసుకొని, వ్యక్తిగత జీవితానికే పరిమితం కాకుండా ప్రజా ఉద్యమాన్ని నిర్మించిన నాయకుడు. ప్రజలలోని అసంతృప్తిని ఒక రాజకీయ శక్తిగా మార్చి, స్వీయ పాలనకు పునాది వేయాలని ప్రయత్నించిన అసాధారణ వ్యక్తిత్వం ఆయనది.నేడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనుండటం ఈ చారిత్రక నేపథ్యంలో ప్రాధాన్యత సంతరించుకుంది. ఇది కేవలం ఒక విగ్రహాన్ని ఏర్పాటు చేసే కార్యక్రమంగా చూడాల్సిన అవసరం లేదు. చరిత్రలో తగిన గుర్తింపు పొందాల్సిన ఒక ప్రజా యోధుడికి అధికారిక గౌరవం ఇవ్వడంతో పాటు, అణగారిన వర్గాల చారిత్రక పాత్రను ప్రజల ముందుకు తీసుకువచ్చే సందర్భంగా దీనిని చూడాలి.

### సామాన్యుడి నుంచి ప్రజా నాయకుడిగా

పాపన్న జీవించిన కాలం సామాజికంగా, రాజకీయంగా సంక్లిష్టమైనది. కులం, వృత్తి, ఆర్థిక స్థాయి, సామాజిక హోదా ఆధారంగా వ్యక్తుల జీవన అవకాశాలు నిర్ణయించబడే పరిస్థితులు బలంగా ఉండేవి. స్థానికంగా భూస్వాములు, దేశ్‌ముఖ్‌లు, జాగీర్దార్లు వంటి అధికార కేంద్రాలు ప్రభావాన్ని కలిగి ఉండేవి. గ్రామీణ సమాజంలోని సాధారణ ప్రజలు అనేక రకాల ఆర్థిక, సామాజిక ఒత్తిళ్లను ఎదుర్కొనేవారు.ఇలాంటి పరిస్థితుల్లో పెరిగిన పాపన్నకు సమాజంలోని అసమానతలు చిన్ననాటి నుంచే కనిపించి ఉండాలి. అయితే ఆ అసంతృప్తిని వ్యక్తిగత ప్రయోజనం కోసం ఉపయోగించుకోకుండా, ప్రజలను ఒక శక్తిగా సమీకరించడం ఆయన ప్రత్యేకత. సాధారణ వ్యక్తి తన చుట్టూ ఉన్న అన్యాయాన్ని చూసి బాధపడటం ఒక విషయం. అదే అన్యాయానికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి, ఒక వ్యవస్థను సవాలు చేసే స్థాయికి ఎదగడం మరో విషయం. పాపన్న ఈ రెండో మార్గాన్ని ఎంచుకున్నారు.అందుకే పాపన్న చరిత్రను ఒక వ్యక్తి జీవితగాథగా మాత్రమే కాకుండా, సామాజిక చైతన్యం ఎలా రాజకీయ శక్తిగా మారగలదో చూపించే చారిత్రక ఉదాహరణగా చూడాలి.

### విభిన్న వర్గాలను ఏకం చేసిన నాయకత్వం

పాపన్న పోరాటంలోని అత్యంత ముఖ్యమైన అంశాల్లో ఒకటి ఆయన నిర్మించిన సామాజిక ఐక్యత. చారిత్రక, జానపద ప్రస్తావనల్లో చాకలి సర్వన్న, మంగలి మాసన్న, కుమ్మరి గోవిందు, జక్కుల పెరుమాళ్లు, దూదేకుల పీరు, మీర్ సాహెబ్ వంటి వివిధ సామాజిక వర్గాలకు చెందిన సహచరుల పేర్లు కనిపిస్తాయి.ఈ అంశం పాపన్న నాయకత్వాన్ని అర్థం చేసుకోవడానికి ఎంతో కీలకం. ఒకే కులం లేదా ఒకే వృత్తికి చెందిన వారిని మాత్రమే సమీకరించి ఉంటే ఆయన పోరాటం పరిమిత పరిధిలోనే ఉండిపోయేది. కానీ వివిధ వర్గాల ప్రజలను ఒకే లక్ష్యం చుట్టూ సమీకరించడం ద్వారా ఆయన సామాజిక ఐక్యతకు ఒక నమూనాను చూపించారు.సమాజంలోని వేర్వేరు వర్గాల మధ్య ఉన్న విభజనలను దాటి ప్రజలను ఒకే పోరాట శక్తిగా మలచడం ఆయన నాయకత్వ సామర్థ్యానికి నిదర్శనం. అందుకే పాపన్న పోరాటాన్ని కేవలం సైనిక పోరాటంగా చూడటం సరైనది కాదు. అది సామాజిక సమీకరణకు సంబంధించిన ఉద్యమం కూడా.

### ప్రజా బలం నుంచి రాజకీయ శక్తి వరకు

పాపన్న పోరాటం కాలక్రమంలో రాజకీయ రూపాన్ని సంతరించుకుంది. పరిమిత వనరులతోనే స్థానిక భౌగోళిక పరిస్థితులను తనకు అనుకూలంగా మలుచుకోవడం, గెరిల్లా యుద్ధ పద్ధతులను ఉపయోగించడం, కోటలను నిర్మించడం, రక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవడం వంటి చర్యలు ఆయన వ్యూహాత్మక సామర్థ్యాన్ని తెలియజేస్తాయి.ఖిలాషాపూర్, తాటికొండ వంటి ప్రాంతాల్లోని కోటలు నేడు ఆయన సైనిక, రాజకీయ ప్రస్థానానికి చారిత్రక ఆనవాళ్లుగా నిలుస్తున్నాయి. ఆ కోటలను కేవలం పురాతన నిర్మాణాలుగా చూడటం సరైంది కాదు. ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చిన నాయకుడు తన ప్రజా బలంతో ఒక రాజకీయ శక్తిగా ఎదగడానికి చేసిన ప్రయత్నానికి అవి ప్రతీకలు.ఆ కాలంలో కోట అంటే కేవలం రక్షణ కట్టడం కాదు. అది అధికారానికి, స్వాతంత్ర్యానికి, రాజకీయ స్వావలంబనకు ప్రతీక. పాపన్న కోటల నిర్మాణం వెనుక కూడా తన ప్రభావాన్ని స్థిరపరచుకోవడం, ప్రజలకు రక్షణ కల్పించడం, ప్రత్యర్థి అధికార కేంద్రాలను ఎదుర్కోవడం వంటి రాజకీయ లక్ష్యాలు ఉన్నాయని చారిత్రక విశ్లేషణలు సూచిస్తాయి.

### గోల్కొండను సవాలు చేసిన సాహసం

పాపన్న ప్రస్థానంలో గోల్కొండ ఘట్టం అత్యంత కీలకమైనది. ఆ కాలంలో గోల్కొండ ఒక ప్రధాన రాజకీయ, సైనిక అధికార కేంద్రంగా ఉంది. అలాంటి శక్తివంతమైన వ్యవస్థను ఒక సామాన్య కుటుంబం నుంచి ఎదిగిన నాయకుడు సవాలు చేయడం ఆయన పోరాటంలోని అసాధారణతను తెలియజేస్తుంది.పాపన్న ప్రభావం విస్తరిస్తున్న కొద్దీ అప్పటి అధికార వ్యవస్థకు ఆయన ఒక సవాలుగా మారారు. స్థానిక అధికార కేంద్రాలను సవాలు చేస్తూ స్వతంత్ర రాజకీయ శక్తిగా ఎదగడం పాలకులకు ఆందోళన కలిగించింది. ఫలితంగా ఆయనపై సైనిక చర్యలు, కోటలపై దాడులు వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి.అయితే ప్రతికూల పరిస్థితులు ఆయనను వెనక్కి నెట్టలేకపోయాయి. ఒకసారి ఎదురుదెబ్బ తగిలితే పోరాటాన్ని ముగించకుండా, మళ్లీ ప్రజలను సమీకరించుకొని తన శక్తిని పునర్నిర్మించుకోవడం పాపన్నలోని అసాధారణ నాయకత్వ లక్షణం. ఓటమిని తాత్కాలికంగా చూడడం, లక్ష్యాన్ని మాత్రం శాశ్వతంగా ముందుంచుకోవడం ఆయన పోరాట తత్వంలో కనిపించే ముఖ్యమైన అంశం.

### పాలన అంటే ప్రజలకు భరోసా

పాపన్నకు సంబంధించిన చారిత్రక, జానపద కథనాల్లో ఆయన కేవలం యుద్ధాలు చేసిన నాయకుడిగా కాకుండా, ప్రజల జీవన పరిస్థితులను అర్థం చేసుకున్న పాలకుడిగా కూడా చిత్రితమవుతారు. వ్యవసాయం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, కులవృత్తులకు ప్రాధాన్యం ఇచ్చినట్లు వివిధ కథనాలు పేర్కొంటాయి.ఇక్కడ ఒక ముఖ్యమైన అంశాన్ని గుర్తించాలి. పాపన్న కాలం నేటి ప్రజాస్వామ్య వ్యవస్థకు పూర్తిగా భిన్నమైనది. కాబట్టి ఆయనను ఆధునిక రాజకీయ ప్రమాణాలతో అంచనా వేయడం కంటే, ఆయన జీవించిన కాలంలోని సామాజిక, రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఆయన చర్యలను అర్థం చేసుకోవాలి.ఆ దృష్టితో చూస్తే ప్రజల నుంచి ఎదిగి, ప్రజల సహకారంతోనే రాజకీయ శక్తిని నిర్మించుకోవడం పాపన్న ప్రస్థానంలో అత్యంత ముఖ్యమైన అంశంగా కనిపిస్తుంది. పాలన అంటే కేవలం భూభాగంపై ఆధిపత్యం కాదు.. ప్రజలకు రక్షణ, భరోసా, ఆర్థిక స్థిరత్వం కల్పించే వ్యవస్థను నిర్మించడమనే భావన ఆయన చరిత్రలో ప్రతిబింబిస్తుంది.

### పాపన్న చరిత్రకు శాస్త్రీయ పరిశోధన అవసరం

పాపన్న గురించి ప్రజల్లో ఉన్న అభిమానానికి ప్రధాన కారణం ఆయన వీరగాథలు. అయితే చరిత్రను కేవలం జానపద కథనాల ఆధారంగా మాత్రమే అర్థం చేసుకోవడం సరైన పద్ధతి కాదు. పాపన్న జీవితంలోని కొన్ని అంశాలకు సంబంధించి చారిత్రక ఆధారాలు, జానపద కథనాల మధ్య భిన్నతలు ఉన్నాయి.ప్రత్యేకంగా ఆయన చివరి దశ, మరణానికి సంబంధించిన వివరాల్లో పలు కథనాలు ప్రచారంలో ఉన్నాయి. అందువల్ల పాపన్న చరిత్రను మరింత లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. అందుబాటులో ఉన్న చారిత్రక పత్రాలు, పురావస్తు ఆధారాలు, కోటల నిర్మాణ శైలి, స్థానిక చరిత్ర, మౌఖిక సంప్రదాయాలు, జానపద గేయాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరించి విశ్లేషించాలి.చరిత్రకు సంబంధించిన ప్రతి అంశాన్ని ఆధారాలతో నిర్ధారించడం వల్ల పాపన్న ప్రాధాన్యత తగ్గదు. పైగా ఆయన చరిత్ర మరింత బలపడుతుంది. పురాణీకరణకు బదులుగా ఆధారబద్ధమైన చరిత్రను నిర్మించడం ద్వారా భావితరాలకు విశ్వసనీయమైన పాపన్న జీవితాన్ని అందించవచ్చు.

### బీసీ, బహుజన వర్గాల చారిత్రక పాత్ర

తెలంగాణ గ్రామీణ సమాజ నిర్మాణంలో బీసీ, బహుజన, వృత్తి ఆధారిత వర్గాల పాత్ర అపారమైనది. వ్యవసాయం నుంచి చేతివృత్తుల వరకు, గ్రామీణ ఉత్పత్తి వ్యవస్థ నుంచి స్థానిక ఆర్థిక వ్యవస్థ వరకు అనేక రంగాలను ఈ వర్గాలు శతాబ్దాలుగా నడిపించాయి.అయితే చరిత్ర రచనలో పాలక వర్గాలకు లభించినంత ప్రాధాన్యం సాధారణ ప్రజలకు, ఉత్పత్తి వర్గాలకు ఎల్లప్పుడూ లభించలేదన్న విమర్శ ఉంది. ఈ నేపథ్యంలో పాపన్న చరిత్రకు మరింత ప్రాధాన్యం ఏర్పడుతుంది.పాపన్న జీవితం ఒక కీలక సందేశాన్ని అందిస్తుంది. అణగారిన వర్గాలు కేవలం పాలనను అనుసరించే ప్రజలు మాత్రమే కాదని, అవసరమైతే తమ హక్కుల కోసం పోరాడగలరని, తమ నాయకత్వాన్ని తామే నిర్మించుకోగలరని ఆయన తన జీవితంతో చూపించారు.ఇది కేవలం గతానికి సంబంధించిన సందేశం కాదు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం గురించి నేటి సమాజంలో జరుగుతున్న చర్చలకు కూడా ఇది వర్తిస్తుంది.

### విగ్రహం ఒక జ్ఞాపక చిహ్నం మాత్రమే కాకూడదు

ట్యాంక్‌బండ్‌పై పాపన్న విగ్రహం ఏర్పాటు కావడం చారిత్రకంగా ముఖ్యమైన పరిణామం. అయితే విగ్రహం ఏర్పాటు చేసినంత మాత్రాన చరిత్రకు న్యాయం జరిగినట్లు కాదు. విగ్రహం ఒక చిహ్నం మాత్రమే. ఆ చిహ్నం వెనుక ఉన్న చరిత్రను సమాజం అర్థం చేసుకునేలా చేయడం అసలు బాధ్యత.పాపన్న పేరు మీద పరిశోధనా సంస్థలు ఏర్పాటు చేయడం, చారిత్రక ప్రదేశాలను అభివృద్ధి చేయడం, మ్యూజియంలను ఏర్పాటు చేయడం, చారిత్రక పత్రాలను డిజిటలైజ్ చేయడం వంటి చర్యలు చేపట్టాలి. ఖిలాషాపూర్, తాటికొండ వంటి ప్రదేశాలను పర్యాటక కేంద్రాలుగా మాత్రమే కాకుండా చారిత్రక అధ్యయన కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి.

పాపన్న జీవితంపై విశ్వవిద్యాలయ స్థాయిలో మరిన్ని పరిశోధనలు జరగాలి. చరిత్రకారులు, పురావస్తు శాస్త్రవేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలు, జానపద పరిశోధకులు కలిసి సమగ్ర అధ్యయనాలు చేపట్టాలి. పాపన్నకు సంబంధించిన జానపద గేయాలు, కథలు, స్థానిక సంప్రదాయాలను సేకరించి భద్రపరచాలి.

### యువతకు పాపన్న చరిత్ర ఎందుకు అవసరం?

నేటి తరానికి పాపన్న చరిత్రను పరిచయం చేయడం అంటే కేవలం ఒక వీరుడి కథ చెప్పడం కాదు. ప్రతికూల పరిస్థితుల్లో నాయకత్వం ఎలా నిర్మించుకోవాలి? ప్రజలను ఎలా ఐక్యం చేయాలి? సామాజిక అసమానతలను ఎలా ప్రశ్నించాలి? లక్ష్యం కోసం ఎంతటి ప్రతిబంధకాలనైనా ఎలా ఎదుర్కోవాలి? అనే అంశాలను పరిచయం చేయడం.సాంకేతికత వేగంగా మారుతున్న ఈ కాలంలో చరిత్రతో యువత అనుబంధం తగ్గిపోకుండా చూడాలి. పాపన్న జీవితాన్ని ఆధునిక మాధ్యమాల ద్వారా యువతకు చేరువ చేయాలి. డాక్యుమెంటరీలు, పుస్తకాలు, డిజిటల్ ఆర్కైవ్స్, చారిత్రక ప్రదర్శనలు, విద్యా కార్యక్రమాల ద్వారా ఆయన వారసత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి.

### చరిత్రను కేవలం జయంతులకే పరిమితం చేయకూడదు

మన సమాజంలో చారిత్రక మహనీయుల జయంతులు, వర్ధంతులు వచ్చినప్పుడు మాత్రమే వారి గురించి చర్చించడం సాధారణంగా మారింది. ఇది చరిత్రకు సరైన న్యాయం చేయదు. పాపన్నను సంవత్సరానికి ఒకసారి స్మరించుకోవడం కంటే, ఆయన చరిత్రపై నిరంతర పరిశోధన జరగడం ముఖ్యం.చరిత్రలో గుర్తింపు పొందని వర్గాల పాత్రను వెలుగులోకి తీసుకురావడం, గతంలోని సామాజిక నిర్మాణాలను అర్థం చేసుకోవడం, ప్రజా పోరాటాల వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించడం నిరంతర ప్రక్రియ కావాలి.పాపన్న విగ్రహావిష్కరణ కూడా ఈ విస్తృత చారిత్రక ప్రక్రియకు ప్రారంభ బిందువుగా మారాలి. విగ్రహం నిలబడాలి.. దాని కంటే ముఖ్యంగా ఆయన చరిత్ర ప్రజల మనస్సుల్లో నిలవాలి.

### పాపన్న సందేశం నేటికీ ప్రాసంగికమే

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రను వెనక్కి తిరిగి చూసినప్పుడు ఒక విషయం స్పష్టమవుతుంది. అధికారం కొద్దిమందికే పరిమితం కావాలని చరిత్ర నిర్ణయించలేదు. ప్రజల్లో చైతన్యం, ఐక్యత, నాయకత్వం ఉంటే సామాన్యుడు కూడా అసాధారణ మార్పుకు కారణమవుతాడు.పాపన్న పోరాటం తన కాలంలోని పరిస్థితులకు ప్రతిస్పందన. నేటి సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు భిన్నమైనవైనా, ఆత్మగౌరవం, సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజా భాగస్వామ్యం వంటి విలువలు మాత్రం ఇప్పటికీ ప్రాధాన్యాన్ని కోల్పోలేదు.అందుకే పాపన్నను ఒక కులానికో, ఒక వర్గానికో పరిమితం చేయకుండా తెలంగాణ సామాజిక చరిత్రలో ఒక ప్రజా నాయకుడిగా చూడాలి. అదే సమయంలో ఆయన చరిత్రను అతిశయోక్తులకు దూరంగా, ఆధారాలతో, శాస్త్రీయ దృక్పథంతో అధ్యయనం చేయాలి.ట్యాంక్‌బండ్‌పై నిలిచే పాపన్న విగ్రహం కేవలం గతాన్ని గుర్తుచేసే శిల్పంగా మిగలకూడదు. అది సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, ప్రజా ఐక్యత, స్వీయ నాయకత్వానికి ప్రతీకగా నిలవాలి. అణగారిన వర్గాల చరిత్రకు గౌరవం లభించినప్పుడే తెలంగాణ చరిత్ర మరింత సంపూర్ణమవుతుంది.పాపన్నను స్మరించుకోవడం అంటే ఒక వీరుడిని కీర్తించడం మాత్రమే కాదు.. ప్రజల ఆత్మగౌరవం కోసం పోరాడిన చరిత్రను గౌరవించడం. ఆయన విగ్రహం ఒక జ్ఞాపకం కావచ్చు.. కానీ ఆయన పోరాట స్ఫూర్తి మాత్రం తరతరాలకు మార్గదర్శకంగా నిలవాలి.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539
flashindia999@gmail.com

# భూసేకరణకు రూ.45 కోట్లు విడుదల

**సత్తుపల్లి,ఫ్లాష్ ఇండియా :** సీతారామ ప్రాజెక్టు ద్వారా సత్తుపల్లి ట్రంక్ పరిధిలోని ఆయకట్టు రైతులకు సాగునీరు అందించే ప్రక్రియలో కీలక ముందడుగు పడింది. మంత్రి తుమ్మల ప్రత్యేక కృషితో మూడు మండలాలు సస్యశ్యామలం కానున్నాయి. మూడో పంప్‌హౌస్ నుంచి నాలుగో పంప్‌హౌస్ మధ్య అవసరమైన భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.45 కోట్లు విడుదల చేసింది. దమ్మపేట, అశ్వారావుపేట మండలాల పరిధిలో మొత్తం 532 ఎకరాల భూమి సేకరణకు ఈ నిధులను వినియోగించనున్నారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో భేటీ అయి, దమ్మపేట, అశ్వరావుపేట, సత్తుపల్లి మండలాల పరిధిలో 532 ఎకరాల భూసేకరణకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఉత్తమ్ కుమార్ రెడ్డి సోమవారం నిధుల విడుదలకు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో దమ్మపేట, అశ్వరావుపేట, సత్తుపల్లి మండలాల్లోని భూములు సస్యశ్యామలం కానున్నాయి. ఆయా ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు సైతం శాశ్వత పరిష్కారం లభించనుంది. ఈ భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, మూడో పంప్‌హౌస్ నుంచి నాలుగో పంప్‌హౌస్ ద్వారా నీటిని విడుదల చేసేందుకు అవసరమైన పనులను వేగవంతం చేయాలని మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు. ఈ సీజన్‌లోనే ఆయకట్టుకు నీరు అందించేలా పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**1.50 లక్షల ఎకరాలకు సాగునీరు..**

సీతారామ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే దమ్మపేట, అశ్వారావుపేట, సత్తుపల్లి తదితర మండలాలకు గోదావరి జలాలు చేరనున్నాయి. ప్రాజెక్టు పూర్తయిన అనంతరం సుమారు 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. దీనివల్ల ఇప్పటి వరకు వర్షాధార పంటలను సాగు చేస్తున్న రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సమయాల్లో సీతారామ ప్రాజెక్టు జలాలు రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయని మంత్రి తుమ్మల అభిప్రాయపడ్డారు.

**సీఎం రేవంత్, డిప్యూటి సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్‌కు కృతజ్ఞతలు..**

సత్తుపల్లి ట్రంక్ భూసేకరణకు రూ.45 కోట్లు విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని భూసేకరణ, పైప్‌లైన్, పంప్‌హౌస్ తదితర పనులను సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన కోరారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు ఆయకట్టుకు చేరితే ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగానికి గణనీయమైన ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.

# టెక్ విద్యకు తగ్గిన క్రేజ్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఒకప్పుడు ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీలో సీట్ల కోసం తీవ్ర పోటీ ఉండేది. ఈ కాలేజీల్లో ప్రవేశం దక్కించుకోవడం ఎంతో ప్రతిష్ఠగా భావించేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలోనే తుది విడత కౌన్సిలింగ్ అనంతరం 2,173సీట్లకు పైగా ఖాళీగా మిగిలాయి. అత్యధిక ఖాళీలు సీఎస్ఈ, దాని అనుబంధ కోర్సుల్లోనే ఉండటం చర్చనీయాంశంగా మారింది.కేయూ కో-ఎడ్యుకేషన్ కాలేజీలో దాదాపుగా సీట్లు భర్తీ కాగా, ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజీలో ఐటీ, ఈఈఈ కోర్సుల్లో భారీగా సీట్లు ఖాళీగా ఉన్నాయి. మహబూబాబాద్ జేఎన్‌టీయూలో సగానికి పైగా సీట్లకు విద్యార్థులు లేరు. మరోవైపు ఎస్ఆర్, కిట్స్ మినహా ఇతర ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో పెద్దఎత్తున సీట్లు మిగిలిపోయాయి. నాణ్యమైన ల్యాబ్‌లు, అనుభవజ్ఞు లైన అధ్యాపకులు, మెరుగైన ప్లేస్‌మెంట్ల కోసం విద్యార్థులు హైదరాబాద్‌లోని ప్రముఖ కళాశాలల వైపు మొగ్గుచూపటంతో ఓరుగల్లులో ఇంజనీరింగ్ విద్యకు క్రేజ్ తగ్గిందనే టాక్ వినబడుతోంది.

**13 కాలేజీలు**

సాంకేతిక విద్యకు ఓరుగల్లు కేంద్రంగా నిలుస్తోంది. దేశంలో ప్రతిష్టాత్మక ఇంజనీరింగ్ కాలేజీ ఎన్ఐటీ వరంగల్‌లోనే ఉంది. ఈ కళాశాలలో జేఈఈ పరీక్షలో వచ్చిన ర్యాంక్ అధారంగా సీట్లు భర్తీ చేస్తారు. నిట్ మినహా రాష్ట్ర ప్రభుత్వం ఎప్‌సెట్ ర్యాంకుల ద్వారా ఇంజనీరింగ్ సీట్లను భర్తీ చేసే కాలేజీలు కూడా వరంగల్‌లో 13 వరకు ఉన్నాయి. వీటిలో కాకతీయ యూనివర్సిటీలోని కేయూ కో-ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రముఖమైంది. అలాగే 2013లో కేయూలో మ హిళ ఇంజనీరింగ్ కాలేజీని ఏర్పాటు చేశారు. వీటితో పాటు 2023లో మహబూబాబాద్‌లో జేఎన్‌టీయూ బ్రాంచ్ ప్రారంభమైంది.ఈ మూడు ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీలతో పాటు ఎస్ఆర్ యూనివర్సిటీ, కిట్స్ వంటి ప్రముఖ ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు ఉన్నాయి. ఇవేకాకుండా వాగ్దేవి, సుమతిరెడ్డి, బిట్స్, జయముఖి, విట్స్, తాళ్ల పద్మావతి , జనగామలో క్రీస్తుజ్యోతి తదితర ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు ఉమ్మడి జిల్లాలో ఉన్నాయి. హైదరాబాద్ తరువాత ఎక్కువ ఇంజనీరింగ్ కాలేజీలు ఉమ్మడి జిల్లాలోనే ఉన్నాయి. ప్రతి ఏటా 10వేల మందికి పైగా ఇంజనీరింగ్ పట్టభద్రులు ఇక్కడి నుంచి బయటకు వస్తున్నారు.

**భారీగా సీట్లు ఖాళీ..**

ఇంజనీరింగ్ కోర్సుకు భారీగా డిమాండ్ ఉన్నప్పటికీ ఉమ్మడి జిల్లాలో ఉన్న రెండు,మూడు మినహా మిగత కాలేజీల్లో సీట్లు భర్తీ కావటం లేదు. ఈ నెల 7వ తేదీన ఫైనల్ ఫేస్ సీట్ల కేటాయింపు పూర్తి చేశారు. ప్రస్తుతం స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహిస్తున్నారు. మొత్తం 13 ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో సుమారు ఐదు వేల సీట్లు ఉండగా, ఫైనల్ ఫేస్ పూర్తయ్యాక 2,173సీట్లు మిగిలే ఉన్నాయి. వీటిలో ప్రతిష్టాత్మక జేఎన్‌టీయూకు అనుబంధంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో 2023లో ప్రారంభించిన ఇంజనీరింగ్ కాలేజీలో సగం సీట్లు కూడా భర్తీ కాకపోవటం హాట్‌టాపిక్‌గా మారింది.సీఎస్ఈతో పాటు సీఎస్ఈ డేటాసైన్స్, ఈసీఈ, ఈఈఈ, ఎంఈసీ కోర్సులు ఉన్నాయి. ప్రతీ కోర్సులో కన్వీనర్ కోటాలో 66సీట్ల చొప్పున మొత్తం 330 సీట్లు ఉండగా, 60 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. ఇంకా దాదాపు 270 సీట్లు ఖాళీగా ఉండటం గమనార్హం. సీఎస్ఈ మాత్రమే 26 సీట్లు భర్తీ కాగా, మిగతా కోర్సుల్లో 10-15మంది మాత్రమే జాయిన్ అయ్యారు. మెకానికల్‌లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడటం లేదని స్పష్టమవుతోంది.అలాగే కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఉన్న మహిళ ఇంజనీరింగ్ కాలేజీలో సీఎస్ఈ, సీఎస్ఈ ఏఐ ఎంఎల్ కోర్సుల్లో దాదాపు సీట్లు భర్తీ కాగా, డేటా సైన్స్‌లో 16 ఖాళీలు ఉన్నాయి. ఇక ఈసీఈలో 11, ఈఈఈలో 45, ఐటీలో 43 వరకు సీట్లు భర్తీ కావాల్సి ఉంది. ఇక కేయూలోని కో-ఎడ్యుకే షన్ ఇంజనీరింగ్ కాలేజీలో మాత్రం దాదాపు సీట్లన్ని భర్తీ అయ్యాయి. ఎంఈసీలో 7, సివిల్‌లో 4, ఐటీలో 2 సీట్లు ఆయా కేటగిరిలో విద్యార్థులు లేకపోవటంతో ఖాళీగా ఉన్నాయి. మూడు ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీల్లో కేయూకే ఎక్కువ డిమాండ్ ఉంది.ఇక ప్రైవేటులోనూ మరీ దారుణంగా సీట్లు మిగిలి పోయాయి. ఎస్ఆర్ యూనివర్సిటీ, కిట్స్, సుమతిరెడ్డి ఇంజనీ రింగ్ కాలేజీల్లో పెద్దగా సీట్లు మిగలలేదు. కానీ మిగతా ఇంజనీరింగ్ కాలేజీల్లో భారీగా సీట్లు మిగిలిపోయాయి. ఒక కాలేజీలో 600 సీట్లు, మరో కాలేజీలో 467సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఈ కాలేజీల్లో సీఎస్ఈ, ఏఐ ఎంఎల్, సైబర్ సెక్యూరిటీ, డేటాసైన్స్ వంటి కోర్సులతో పాటు సంప్రదాయ కోర్సులు ఈఈఈ, ఈసీఈ, మెకానికల్ ఇంజనీరింగ్ వంటి కోర్ కోర్సులకు కూడా ఆదరణ లేకుండా పోయింది.

**ల్యాబ్‌లు, ఫ్యాకల్టీ కొరతే కారణమా..?**

ఉమ్మడి జిల్లాలో 13కు పైగా ఇంజనీరింగ్ కాలేజీలుంటే దాదాపు 40శాతం సీట్లు మిగలడం చర్చనీయాంశంగా మారింది. ఈఈఈ, ఈసీఈ, ఎంఈసీ తదితర కోర్ కోర్సులకు ల్యాబ్‌లు ప్రధానం. అయితే రెండుమూడు కాలేజీలు మినహా మిగతా వాటిల్లో ల్యాబ్‌లు అంతంతే ఉండటంతో పాటు అనుభవజ్ఞులైన అధ్యాపకులు కూడా లేకపోవటం మైనస్‌గా మారిందనే టాక్ వినబడుతోంది. యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీల్లో కూడా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు అధ్యాపకులే భోదన చేస్తున్నారు. కొన్ని ప్రైవేటు కాలేజీల్లో అయితే 20-30వేల వేతనానికి అధ్యాపకులు తీసుకుంటున్నారు. దీంతో నాణ్యమైన విద్య అందటం లేదనే భావనలో విద్యార్థ తల్లిదండ్రులు ఉన్నారు.



వీటితో పాటు మరో కీలకమైన అంశం ప్లేస్‌మెంట్‌లు.వరంగల్‌లో ఐటీ ఇండస్ట్రీస్‌లు పెద్దగా లేకపోవటంతో హైదరాబాద్ నుంచి పెద్దపెద్ద కంపెనీలు వరంగల్‌కు వచ్చి ప్లేస్‌మెంట్‌లు ఇచ్చే అవకాశాలు లేవు. దీంతో చాలామంది విద్యార్థులు ఆఫ్ క్యాంపస్‌పైనే ఆధారపడి ఉద్యోగాలు వెతుక్కోవలసి వస్తోంది. అదే హైదరాబాద్‌లో అయితే టైర్-3 కాలేజీ లో జాయిన్ అయినా బీటెక్ పూర్తి కాగానే చిన్నపాటి ఉద్యోగం వస్తుందనే భరోసా చాలామంది విద్యార్థులు హైదరాబాద్ వైపు మొగ్గు చూపుతున్నారు. కన్వీనర్ కోటాలో సీటు వచ్చినప్పటికి ట్యూషన్ ఫీజుతో పాటు హాస్టల్ ఫీజులు, ఇతర ఖర్చులతో తడిసిమోపెడు అవుతున్నాయి. అయినప్పటికీ కొందరు సాహసం చేసి విద్యార్థులను హైదరాబాద్‌లో పేరున్న ఇంజనీరింగ్ కాలేజీల్లో చేర్పిస్తున్నారు.

**యాజమాన్య కోటాకు బీటలే..**

ఇంజనీరింగ్ కాలేజీల్లో 70శాతం కన్వీనర్ కోటాలో ప్రభుత్వం సీట్లను భర్తీ చేస్తుండగా, మిగతా 30శాతం సీట్లను యాజమాన్యం కోటా కింద భర్తీ చేస్తారు. ఎంసెట్‌లో 10వేల లోపు ర్యాంకు వచ్చిన విద్యార్థులతో పాటు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రభుత్వమే పూర్తిగా ఫీజు చెల్లిస్తుంది. పదివేలకు పైగా ర్యాంకు వచ్చిన విద్యార్థులకు రూ.35వేల ఫీజురీయింబర్స్‌మెంట్‌ను చెల్లిస్తుంది. అయితే రెండుమూడు కాలేజీలు మినహా మిగతా ఇంజనీరింగ్ కాలేజీల్లో యాజమాన్య కోటా సీట్లు భర్తీకి నోచుకునే పరిస్థితి కనిపించటం లేదు. కన్వీనర్ కోటాలోనే చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపటం లేదు. దీంతో యాజమాన్యం కోటాలో చేరటం కష్టమనే టాక్ వినబడుతోంది.అయితే ఒకటిరెండు కాలేజీల్లో మాత్రం యాజమాన్య కోటాకు భారీగా డిమాండ్ ఉందనే టాక్ ఉంది. డోనేషన్‌ల రూపంలో సీటుకు రూ.3 లక్షల వరకు వసూళ్లు చేస్తుండగా, మరో ఇంజనీరింగ్ కాలేజీలో మాత్రం ఇంటర్ మార్కుల ఆధారంగా ఫీజులను పెంచుతూ డోనేషన్‌ను పరోక్షంగా వసూళ్లు చేస్తున్నారనే టాక్ వినబడుతుంది. మరో ఇంజనీరింగ్ కాలేజీలో మాత్రం డోనేషన్‌ను రూ.లక్ష వరకు వసూళ్లు చేస్తున్నారు. రెండుమూడు కాలేజీల్లో మాత్రమే సీట్లకు డిమాండ్ ఉండగా, చాలా కాలేజీలు విద్యార్థులు లేక వెలవెలపోతున్నాయి. కన్వీనర్ కోటాలోనే సీట్లు మిగిలిపోతుండటంతో ఇక యాజమాన్య కోటాలో చేరేవారు లేకుండాపోయారు.

# ప్రమోషన్ల వివాదం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రమోషన్ల అంశం చర్చనీయాంశంగా మారింది. ఈఎన్సీ కావాలనే ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్లు(ఈఈ), డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్లు(డీఈఈ) ప్రమోషన్లను పెండింగ్ లో పెడుతున్నారని ఇంజినీర్స్ అసోసియేషన్ విమర్శిస్తోంది. అందులో భాగంగానే మాసబ్ ట్యాక్ లోని పీహెచ్ఎంఈ ప్రధాన కార్యాలయంలో సోమవారం ధర్నా నిర్వహించాలని నిర్ణయించింది. ఈ విషయం తెలుసుకున్న ఈఎన్సీ వెంటనే సచివాలయంలోని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ ను కలవడానికి వెళ్లారు. దీంతో విషయం తెలుసుకున్న ఇంజినీర్స్ అసోసియేషన్ ధర్నాను వాయిదా వేస్తున్నట్టు ప్రకటించింది.

**జీహెచ్ఎంసీలో ముదిరిన వివాదం**

ఓ రిటైర్ చీఫ్ ఇంజినీర్ కు ఎక్స్ టెన్షన్ ఇవ్వాలనే అంశం వివాదానికి దారితీసింది. అయితే రిటైర్ అధికారి ఎక్స్ టెన్షన్ ఇవ్వకూడదని పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్.శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ కమిషనర్, పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం(పీహెచ్ఎంఈ) ఈఎన్సీకి వినతి పత్రాలను అందజేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గోల్కొండ జోన్ ఇన్ చార్జి ఎస్ఈగా పనిచేస్తున్న ఆర్.శ్రీనివాస్ రెడ్డిని మెహిదీపట్నం సర్కిల్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్(ఈఈ)గా బదిలీ చేయడం వివాదాస్పదంగా మారింది. అయితే గోల్కొండ జోన్ ఇన్ చార్జి ఎస్ఈ బాధ్యతలను ఖైరతాబాద్ జోన్ ఇన్ చార్జి ఎస్ఈ విజయ్ కుమార్ రెడ్డికి అప్పగించారు. అయితే ఎక్స్ టెన్షన్ ను అడ్డుకుంటున్నందుకే తన ఎఫ్ఏసీ పోస్ట్ తొలగించి తనకన్న జూనియర్ ఇంజినీర్ వద్ద పనిచేయాలని ఆదేశాలు జారీచేయడం సరికాదని ఆర్.శ్రీనివాస్ రెడ్డి అభిప్రాయం వ్యక్తంచేశారు. ఎట్టి పరిస్థితిలో జూనియర్ కింద పనిచేయబోనని స్పష్టం చేశారు. ఈ విషయంపై కమిషనర్ ను కలవడానికి వెళ్తే నిరాకరించారని, చీఫ్ ఇంజినీర్ ను కలవాలని సూచించినట్టు తెలిసింది. సీఈని కలిస్తే అడ్మినిస్ట్రేషన్ లో అనేక కోణాలుంటాయని, అన్ని చెప్పడానికి అవకాశంలేదని చెప్పినట్టు సమాచారం.



## చిన్నారెడ్డి, మేఘారెడ్డి వివాదంపై స్పందించిన టీపీసీసీ చీఫ్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కాంగ్రెస్ సీనియర్ నేత చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి మధ్య నెలకొన్న వివాదంపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. చిన్నారెడ్డి వ్యాఖ్యల వీడియో క్లిప్పింగ్స్ తెప్పించుకున్నామని, కమిటీ వాటిని పరిశీలిస్తోందని అన్నారు. చిన్నారెడ్డి సీనియర్ నేత అని యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ప్రస్థానం మొదలుపెట్టి మంత్రిగా, ఇవాళ ప్లానింగ్ బోర్డు చైర్మన్ గా రకరకాల పదవులు అనుభవించారని చెప్పారు. సీనియర్ నాయకుడికి అన్నిరకాలుగా గౌరవం ఇచ్చామని, భవిష్యత్ లోనూ ఇస్తామని అన్నారు. ఆయన మాట్లాడింది నిశితంగా పరిశీలించిన తరవాత సమగ్ర నివేదికను ఏఐసీసీకి పంపిస్తామని చెప్పారు.ఇదిలా ఉంటే వనపర్తి నియోజకవర్గ కాంగ్రెస్ లో వర్గపోరు తారాస్థాయికి చేరింది. ఎమ్మెల్యే మేఘారెడ్డి, ప్లానింగ్ బోర్డు చైర్మన్ చిన్నారెడ్డి మధ్య విభేదాలు మొదలయ్యాయి. ఇటీవల ఓ కార్యక్రమంలో చిన్నారెడ్డి మాట్లాడుతూ.. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో అన్నీ భరిస్తూనే కాంగ్రెస్ లో కొనసాగుతున్నానని చెప్పారు. లేదంటే మరో జీవన్ రెడ్డిలా పార్టీకి దూరం అయ్యేవాడినని అన్నారు. 45 ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడ్డానని, కానీ పార్టీ జెండా ఎప్పుడూ మోయని వారికి టికెట్లు కేటాయించారని అన్నారు. గతంలో కాంగ్రెస్ లో ఉండి తరవాత బీఆర్ఎస్‌లో చేరి డబ్బు సంపాదించి తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చినవారికి టికెట్లు ఇవ్వడం సరికాదని అభిప్రాయపడ్డారు. అంతే కాకుండా మేఘారెడ్డి డబ్బులు ఇచ్చి టికెట్ కొనుకున్నారని ఆరోపించారు. చిన్నారెడ్డి ఆరోపణలపై మేఘారెడ్డి పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు.

# పాడైపోయిన క్రీమ్‌తో నెయ్యి దందా..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ నగరంలో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ నెయ్యి మాఫియాపై హైదరాబాద్ కమిషనర్ టాస్క్‌ఫోర్స్ విభాగమైన హెచ్-ఫాస్ట్ విరుచుకుపడింది. నగర కమిషనరేట్ పరిధిలోని కల్తీ నెయ్యి తయారీ, విక్రయ యూనిట్లపై అధికారులు అత్యంత రహస్యంగా, విస్తృతంగా దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా, ప్రమాదకర రసాయనాలతో నెయ్యిని తయారు చేస్తున్న మూలాలను మట్టుబెట్టారు. ఈ దాడులకు సంబంధించిన వివరాలను హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సీపీ వి.సి. సజ్జనార్ విలేకరుల సమావేశంలో అధికారికంగా వెల్లడించారు. కల్తీ ఆహారం నుంచి తెలంగాణను విముక్తి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసిన సీపీ, ప్రజల ప్రాణాలతో ఆడుకునే నిందితులపై రాబోయే రోజుల్లో కఠినమైన 'పీడీ యాక్ట్' నమోదు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు హెచ్చరించారు.

**రూ.కోట్ల విలువైన కల్తీ పదార్థాల స్వాధీనం**

హెచ్-ఫాస్ట్ నిర్వహించిన ఈ ప్రత్యేక తనిఖీల్లో దాదాపు 25.5 టన్నుల కల్తీ నెయ్యితో పాటు, దాని తయారీకి వినియోగిస్తున్న 10.5 టన్నుల ముడి పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తంగా 36 టన్నుల కల్తీ సామాగ్రిని సీజ్ చేశారు.

**స్వాధీనం చేసుకున్న పదార్థాల వివరాలు:**

**కల్తీ నెయ్యి: 25.5 టన్నులు**
**పాడైపోయిన క్రీమ్: 8.7 టన్నులు**
**పామాయిల్: 1,200 లీటర్లు**
**వనస్పతి: 600 లీటర్ల**
**కల్తీ ఫ్లేవర్ బాటిళ్లు: 3 వెరైటీలకు చెందిన 6 సీసాలు**
**గంజి పొడి: 30 కిలోలు**

ఈ ముఠా నెయ్యి తయారీకి ఉపయోగిస్తున్న పదార్థాలు అధికారులను సైతం విస్తుపోయేలా చేశాయి. హర్యానా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి పాడైపోయిన క్రీమ్‌ను తక్కువ ధరకు దిగుమతి చేసుకుంటున్నారు. దానికి పాల పౌడర్, పామాయిల్, వనస్పతి, గంజి పొడిని కలుపుతున్నారు. వినియోగదారులకు అసలైన నెయ్యిలా పూస పూసగా కనిపించడం కోసం ప్రత్యేకంగా "బొంబాయి రవ్వ"ను మిక్స్ చేస్తున్నట్లు విచారణలో తేలింది. అసలైన నెయ్యి వాసన రావడం కోసం కెమికల్ ఫ్లేవర్ బాటిళ్లను వాడారు. ఆ బాటిళ్లపై "ఆహారంలో ఉపయోగించరాదు" అని స్పష్టమైన హెచ్చరికలు ఉన్నప్పటికీ, లాభాపేక్షతో దాన్నే నెయ్యిలో కలిపేస్తున్నారు. ఈ కల్తీ నెయ్యిని ఆవు నెయ్యి, దేశీ నెయ్యి పేరుతో మార్కెట్లో అక్రమంగా విక్రయిస్తున్నారు. ప్రధానంగా హోటళ్లు, ఫంక్షన్లలో వంటకాల కోసం, ప్రముఖ స్వీట్ షాపుల్లో ప్యూర్ నెయ్యి స్వీట్లు అని నమ్మించి అమ్మడానికి, చివరికి ఆయుర్వేదిక్ మెడిసిన్ తయారీలో కూడా ఈ కల్తీ నెయ్యినే ఉపయోగిస్తుండటం గమనార్హం.ఇక వీరు ప్యాక్ చేసే ప్యాకెట్లపై ఎలాంటి లేబుల్ ఉండదు. తయారీ తేదీ , ఎక్స్‌పైరీ తేదీ, అసలు కంపెనీ పేర్లు, చిరునామాలు ఏవీ ముద్రించకుండానే మార్కెట్లోకి వదులుతున్నారు. స్వాధీనం చేసుకున్న నమూనాలను ల్యాబ్‌కు పంపగా దిగ్భ్రాంతికర విషయాలు వెలుగు చూశాయి. సాధారణంగా నెయ్యి ప్యూర్ గా ఉందో లేదో తెలిపే ఆర్.ఎమ్ వాల్యూ 24 కంటే ఎక్కువగా, గరిష్ఠంగా 42 వరకు ఉండాలి. కానీ వీరు పామాయిల్, డాల్డా కలపడం వల్ల ఆర్.ఎమ్ వాల్యూలో తీవ్రమైన తేడాలు వచ్చాయి. అంతేకాకుండా 'అబ్సెంట్' (సున్నా) అని ఉండాల్సిన విషపూరిత పారామీటర్లు ఏకంగా 20,000 వరకు నమోదయ్యాయని సీపీ తెలిపారు.ఇలాంటి కల్తీ నెయ్యిని నిత్యం వాడటం వల్ల ప్రజలకు గుండె సంబంధిత తీవ్రమైన వ్యాధులు, కాలేయం పాడవ్వడం, వివిధ రకాల చర్మవ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. రాబోయే రోజుల్లో 'టిజి సేఫ్' విభాగంతో సమన్వయం చేసుకుంటూ నగరవ్యాప్తంగా మరిన్ని దాడులు తీవ్రతరం చేస్తామని పోలీసులు స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యంతో చలగాటం ఆడే కల్తీ వ్యాపారులపై ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని కమిషనర్ హెచ్చరించారు.

# ఒకరిని మించి మరొకరు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** గత బీఆర్ఎస్ (BRS) పాలనలో జరిగిన భూ అక్రమాల కంటే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భూ దోపిడీ రెండు రెట్లు పెరిగిందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్, రేవంత్ రెడ్డి ప్రభుత్వాల తీరుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం ప్రజలకు కేటాయించిన భూములు, పరిశ్రమల కోసం ఇచ్చిన స్థలాలు, చివరికి ప్రభుత్వమే లేఅవుట్లు వేసి విక్రయించిన భూములను కూడా '22ఏ (22A) నిషేధిత జాబితాలో చేర్చడం దారుణమని ఈటల మండిపడ్డారు. దశాబ్దాలుగా రైతులు సాగు చేసుకుంటున్న భూములను లాక్కోవడం వెనుక భూమాఫియాకు కట్టబెట్టాలనే కుట్ర ఉందని ఆయన ఆరోపించారు. "ధరణి పోర్టల్ రద్దు చేసినా, భూములను లాక్కునే ప్రభుత్వాల ధోరణిలో ఏ మార్పు రాలేదు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం భూ దందాలకు పాల్పడితే, ఇప్పుడు రేవంత్ రెడ్డి సర్కార్ ఆ భూములను 'సైటిల్ మెంట్' చేసుకుంటోంది" అని ఈటల విమర్శించారు. గతంలో జరిగిన హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఖర్చు చేసిన డబ్బులు ఇలాంటి భూ దందాల ద్వారా వచ్చినవేనని ఆయన సంచలన ఆరోపణలు చేశారు.

**గల్ఫ్ ఆయిల్ భూముల కథ ఇదీ..**

గల్ఫ్ ఆయిల్ కంపెనీకి చెందిన భూములు ఫీనిక్స్ కంపెనీ మీదుగా ఎలా చేతులు మారాయో అందరికీ తెలుసని, ఈ అక్రమాల్లో పెద్దల హస్తం ఉందని ఎంపీ పేర్కొన్నారు. పేదలకు, రైతులకు అన్యాయం చేస్తూ రియల్ ఎస్టేట్ మాఫియాలకు కొమ్ము కాయడం మానుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ అరాచకాలను అడ్డుకునే వరకు బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

## అలంకారప్రాయంగా మారిన జమ్మికుంట క్లాక్ టవర్..



**జమ్మికుంట,ఫ్లాష్ ఇండియా :** జమ్మికుంట పట్టణ ప్రజలకు టైం చూపించాల్సిన క్లాక్ టవర్ ప్రస్తుతం అలంకారప్రాయంగా మారింది.ఇటీవల రెండు నెలల కిందట అట్టహాసంగా నెలకొల్పిన ఈ క్లాక్ టవర్‌ను ఆ తర్వాత పట్టించుకునే వారే లేరు. ఇందులో ఏర్పాటు చేసిన గడియారాలు ఒక్కటి కూడా పనిచేయడం లేదు.దీంతో పాటు క్లాక్ టవర్ చుట్టూ రోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది."కాంట్రాక్టర్ల, స్థానిక నాయకుల, అధికారుల జేబులు నింపుకోవడం కోసమే ఇలాంటి పనులు చేపడుతున్నారని, ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని" స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.లక్షల రూపాయలు ఖర్చుపెట్టి నిర్మించిన క్లాక్ టవర్ నిరుపయోగంగా ఉండటం, చుట్టుపక్కల ప్రాంతం అస్తవ్యస్తంగా ఉండడం పై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.కావున మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి క్లాక్ టవర్‌లోని గడియారాలను రిపేర్ చేయించి, చుట్టూ ఉన్న గుంతలను పూడ్చి ప్రజా వినియోగానికి అందుబాటులోకి తేవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# బస్సు వేళలు మార్చండి సార్...



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ నియోజకవర్గం లోని అడవిదేవులపల్లి మండల కేంద్రము నుంచి మిర్యాలగూడకు నడిచే బస్సు వేళల్లో మార్పులు చేయడంతో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు,విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఉపాధ్యాయులు తెలిపారు.ఉదయం బస్సు సమయాన్ని 8:00 గంటల నుంచి 8:30 గంటలకు,సాయంత్రం 4:30 గంటల నుంచి 6:15 గంటలకు మార్చడంతో పాఠశాలలకు సమయానికి చేరుకోవడం,తిరిగి ఇళ్లకు వెళ్లడం ఇబ్బందిగా మారిందని పేర్కొన్నారు.విద్యార్థులు,ఉపాధ్యాయుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గతంలో ఉన్న బస్సు వేళలను పునరుద్ధరించాలని సంబంధిత ఆర్టీసీ అధికారులను ఉపాధ్యాయులు అందరూ కలసి వినతి పత్రాన్ని సమర్పించడం జరిగింది.

# సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ కు ఘన నివాళులు



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 376వ జయంతి సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని గౌడ సంఘం భవనంలో గౌడ సంఘం సభ్యులతో కలిసి వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ బడుగు,బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన గొప్ప వీరుడు అని కొనియాడారు.సమాజంలో అణగారిన వర్గాలకు ఆత్మగౌరవం, సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు.పాపన్న గౌడ్ మహారాజ్ ఆశయాలు,స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు,సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న ఆశయ సాధనకు కృషి చేయాలి



**మిర్యాలగూడ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** తెలంగాణ తొలి బహుజన చక్రవర్తి, బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 376వ జయంతిని బీసీ జేఏసీ మిర్యాలగూడ పట్టణ కన్వీనర్ బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మిర్యాలగూడ పట్టణంలోని బీసీ బాలుర వసతిగృహంలో పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం మొఘలాయిలు, దొరల అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడిన తొలి బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని అన్నారు. తెలంగాణ ప్రాంత ప్రజలను దౌర్జన్యాలు, దోపిడీ నుంచి కాపాడేందుకు పాపన్నగౌడ్ పోరాటం చేశారని పేర్కొన్నారు.సామాన్య గౌడ కుటుంబంలో జన్మించిన పాపన్నగౌడ్ చిన్ననాటి నుంచే ప్రజలు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను గమనించారని తెలిపారు. ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకున్న ఆయన యుక్త వయస్సులోనే దౌర్జన్యాలు, దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం ప్రారంభించారని అన్నారు.సుమారు 30 సంవత్సరాల పాటు ప్రజల హక్కులు, సామాజిక సమానత్వం కోసం పోరాడిన సర్వాయి పాపన్నగౌడ్ స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా యువత ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రబెల్లి దుర్గయ్య రజక, బీసీ బాలుర వసతిగృహ వార్డెన్ తరుణ్ కుమార్, బీసీ విద్యార్థి సంఘం పట్టణ కార్యదర్శి నక్క నాగరాజు, సామాజికవేత్త, తెలంగాణ ఉద్యమకారుడు యండీ మహమ్మద్, బీసీ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి బంటు కవిత, నిఖిల్, నాగరాజు, చైతన్య, భరత్, ఈశ్వర్, కార్తీక్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ ఆయిల్ అమ్ముతున్న ఇద్దరి అరెస్ట్

**హుజూర్ నగర్,ఫ్లాష్ ఇండియా :** నకిలీ ఆయిల్ దందాకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను సిసిఎస్ పోలీసులు అరెస్టు చేసిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. మంగళవారం హుజూర్‌నగర్ పట్టణంలో నకిలీ హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్పీసీఎల్) కంపెనీ పేరుతో నకిలీ ఆయిల్ డబ్బాలను విక్రయస్తూన్నారనే సమాచారం మేరకు సూర్యాపేట సీసీఎస్ పోలీసులు, కంపెనీ ప్రతినిధులు సంయుక్తంగా ఆటోమొబైల్ షాపుపై దాడి చేసి షాప్ యజమానిని పట్టుకున్నారు.వివరాల ప్రకారం.. హుజూర్ నగర్ పట్టణంలోని ఇందిరా సెంటర్ కోదాడ రోడ్‌లోని ఉన్న సత్య సాయి ఆటో మొబైల్స్, లక్ష్మి నర్సింహా ఆటోమొబైల్ షాపులలో తనిఖీలు చేపట్టగా, అక్కడ నకిలీ హెచ్పీసీఎల్ హైడ్రాలిక్ ఆయిల్ టిన్ను విక్రయిస్తున్నట్లు నిర్ధారణ అయింది. హైడ్రాలిక్ ఆయిల్‌ను పట్టణంలో గల రెండు షాపుల నుంచి మొత్తం 20 లీటర్ల డబ్బాలు 28, ఎక్కువ మొత్తంలో నకిలీ హైడ్రాలిక్ ఆయిల్ టిన్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కాగా, హిందుస్థాన్ కంపెనీ ప్రతినిధి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు సీసీఎస్ పోలీసులు దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్న నకిలీ ఆయిల్ టిన్నులను సీజ్ చేసిన టిన్నులను హుజూర్ నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా షాప్ యజమానులను సిసిఎస్ పోలీసులు సూర్యాపేటకు తీసుకువెళ్లారు.





# ప్రకృతి వ్యవసాయంపై కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ ద్వారా రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు.లింగాల ఘనపురం మండలం సిరిపురంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని కలెక్టర్ సందర్శించారు.బయో రిసోర్స్ సెంటర్ ద్వారా రైతులకు అందుతున్న జీవ ఇన్‌పుట్ల తయారీ, వినియోగాన్ని పరిశీలించారు.10 ఎకరాల్లో సాగు చేస్తున్న వివిధ రకాల కూరగాయలు, డ్రాగన్ ఫ్రూట్, వరి పంటలను పరిశీలించారు.దేశవాళీ ఆవుల గోమూత్రం, పేడతో జీవామృతం, ఘన జీవామృతం, వేప కషాయం వంటి సహజ ఉత్పాదకాలను తయారు చేస్తున్న విధానాన్ని తెలుసుకున్నారు.వర్మీ కంపోస్ట్ వినియోగాన్ని కూడా పరిశీలించారు.స్థానికంగా లభించే సహజ వనరులతో జీవ ఇన్‌పుట్లు తయారు చేసుకోవడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చని కలెక్టర్ సూచించారు.ప్రకృతి వ్యవసాయంతో నేల సారం, పర్యావరణాన్ని కాపాడటంతో పాటు రైతులకు అదనపు ఆదాయం లభించేలా పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించాలని అన్నారు.రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.బయో రిసోర్స్ సెంటర్లను రైతులకు ఉపయోగకరమైన కేంద్రాలుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సూచించారు.

# ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

## మైలార్‌దేవ్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయ్



**రంగారెడ్డి,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి మంగళవారం మైలార్‌దేవ్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డాక్టర్ స్వర్ణ కుమారి పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వైద్య కేంద్రంలోని వైద్య సేవలు, రోగుల నమోదు, సిబ్బంది హాజరు, మందుల లభ్యత, ల్యాబొరేటరీ సేవలు, శుభ్రత, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు, మందులు, వివిధ ఆరోగ్య కార్యక్రమాల ప్రయోజనాలను ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రోగులతో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పారిశుద్ధ్యం, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, అవసరమైన మందుల నిల్వ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ సూచించారు.జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డాక్టర్ స్వర్ణ కుమారి మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవల నాణ్యతను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వైద్య సిబ్బంది సేవలు అందించాలని సూచించారు.ఈ ఆకస్మిక తనిఖీలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు



**వలిగొండ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** వలిగొండ పట్టణ కేంద్రంలో మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను గౌడ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, వీరత్వానికి ప్రత్యేకంగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సబ్బండ వర్గాల ప్రజలకు రాజకీయ సామాజిక సమానత్వం కోసం చేసిన కృషి మరచిపోలేనిదని కుల మతాల వివక్ష లేకుండా అన్ని వర్గాలు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కావాలని సమసమాజ ప్రజాస్వామిక స్ఫూర్తితో మొగల్ చక్రవర్తులకు వ్యతిరేకంగా పోరాడి గోల్కొండ కోటపై జెండా ఎగరవేసిన గొప్ప బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుంభం వెంకట్ పాపిరెడ్డి, గీత కార్మిక సంఘం అధ్యక్షుడు కొండూరు అంజయ్య, పబ్బు స్వామి గౌడ్, బత్తిని దేవేందర్ గౌడ్, మారగోని సత్యనారాయణ, రాగీరు మధు, బత్తిని నరసింహ, బందారపు లింగస్వామి, పబ్బు సురేందర్ , పంజాల రమేష్, కొండూరు వెంకన్న, శ్రీరాములు, మారగోని శ్రీనివాస్, బొడిగె సుదర్శన్, బత్తిని శేఖర్ ,బత్తిని శెట్టయ్య, కొండూరు సాయి, పబ్బు మల్లయ్య, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు



**జనగామ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ప్రతి ఒక్కరూ పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు.మంగళవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన గావించి, పూలమాలలు సమర్పించి, ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సామాజిక, ఆర్థిక అసమానతలకు వ్యతిరేకంగా నిలిచి, సామాన్య ప్రజల ఆత్మగౌరవం కోసం పోరాడారని పేర్కొన్నారు. వెనుకబడిన, అణగారిన వర్గాలకు సమాజంలో సమాన గౌరవం, హక్కులు కల్పించాలనే పాపన్న గౌడ్ ఆలోచనలు నేటికీ స్ఫూర్తిదాయకమన్నారు.సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్ర కేవలం ఒక వ్యక్తి జీవిత చరిత్ర మాత్రమే కాదని, సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, సమానత్వం కోసం సాగిన పోరాటానికి ప్రతీక అని తెలిపారు.అదే విధంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోం, ఆర్టీఏ సభ్యులు చిలువేరు అభి గౌడ్, కుల సంఘాల ప్రతినిధులు, సభ్యులు, అధికారులు అందరూ పాల్గొని, పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు సమర్పించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ సంపాదకీయులు కన్నా పరశురాములు, జిల్లా కురుమ సంఘం జనరల్ సెక్రటరీ జాయ మల్లేష్, జిల్లా నాయకులు కర్రే రాజశేఖర్, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు వేముల బాలరాజు, బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు గూడల సిద్దయ్య, దిశా కమిటీ మెంబర్ బక్క శ్రీనివాస్, ఇతర కుల సంఘాల నాయకులు, ఐడిఓసి సిబ్బంది, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సొమ్ము కేంద్రానిది ... సోకు రాష్ట్రా 'నీదా'?

## స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని మోదీ ఫోటో ముద్రించాలి



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** తెలంగాణ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెడుతున్న స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫొటోను ముద్రించాలని కోరుతూ బీజేపీ మిర్యాలగూడ 1టౌన్ నాయకులు మంగళవారం ఆర్డీవో రమణారెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ...కేంద్రం సొమ్ముతో రాష్ట్రం సోకులు పడుతుందని కొత్తగా మంజూరు చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫొటో లేకపోవడం విచారకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం ద్వారా తెలంగాణలోని పేదలకు ఉచితంగా బియ్యం అందిస్తోందని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆహార భద్రత పథకాలకు తగిన గుర్తింపు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేసుకోవడం సరికాదని వారు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను స్పష్టంగా తెలియజేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 30 నెలలు గడిచినా ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని కేంద్రం ఇచ్చిన మూడు కోట్ల 76 లక్షల రూపాయల నిధులతో మాత్రమే అభివృద్ధి చేస్తున్నారు. బీజేపీ నాయకులు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులతోనే రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కేంద్ర నిధులతో రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేసుకోవడం తగదని విమర్శించారు.స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని మోదీ ఫొటోను ముద్రించడంతో పాటు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల వివరాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ 1టౌన్ పట్టణ అధ్యక్షుడు బంటు గిరి, కార్యదర్శి కొంగరి వెంకటరమణ, మూల రాజిరెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి చిల్లంచర్ల అభి, సీనియర్ నాయకులు బంటు సైదులు, మొదాల అశోక్, గొనే కవిత, మండల సోములు, మున్సిపల్ కౌన్సిలర్ వెలుగు ఇందిరా నాగరాజు, ఉబ్బపల్లి నంద, చిలుకూరి శ్యామ్, జిల్లా కార్యవర్గ సభ్యులు లక్ష్మారెడ్డి, మంద శివ, చిలుకూరి వెంకటేశ్వర్లు, యాదగిరి, వేణు, శివయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# మండల ప్రజావాణికి విశేష స్పందన



**ఖానాపురం,ఫ్లాష్ ఇండియా :** మండల ప్రజావాణి కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఎంపీడీవో వనపర్తి అద్వైత ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు అధికారులకు వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా మండల విద్యా వనరుల కేంద్రం పరిధిలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లను మార్చాలని మండల విద్యాశాఖ అధికారులు వినతిని సమర్పించారు. దీనిపై స్పందించిన విద్యుత్ శాఖ ఏఈ మంగమ్మ వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి, 24 గంటల్లోపే సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు.ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించడంతో స్థానికులు, అధికారులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు తక్షణ స్పందనతో చర్యలు తీసుకోవడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.



# ఆ ప్లేయర్‌కు ఏమైంది..?

గాలే వేదికగా భారత్, శ్రీలంక జట్ల మధ్య జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్ నాల్గో రోజు ఆటలో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. శ్రీలంక సీనియర్ బ్యాటర్, 36 ఏళ్ల దినేష్ చండీమాల్ ఫీల్డింగ్ చేస్తూ తీవ్రంగా గాయపడ్డారు. నాలుగో రోజు తొలి సెషన్‌లో బావుండ్రీ వద్ద బంతిని నిరోధించే క్రమంలో డైవ్ చేయడంతో ఆయన కుడి భుజం, మెడ భాగంలో బలమైన దెబ్బ తగిలింది. గ్రౌండ్‌లోకి వచ్చిన శ్రీలంక జట్టు ఫిజియో, వైద్యులు ప్రాథమికంగా పరిశీలించినప్పటికీ నొప్పి తీవ్రంగా ఉండటంతో ఆయన మైదానాన్ని వీడాల్సి వచ్చింది. అనంతరం ముందస్తు జాగ్రత్త చర్యగా చండీమాల్‌ను స్కానింగ్ నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ విషయాన్ని ధ్రువీకరిస్తూ శ్రీలంక క్రికెట్ బోర్డ్ ప్రకటన విడుదల చేసింది. వైద్య నివేదికలు వచ్చాకే ఆయన గాయం తీవ్రతపై స్పష్టత రానుంది. 93 టెస్టుల్లో 16 శాతకాలతో 6,500 కంటే ఎక్కువ పరుగులు చేసిన చండీమాల్‌కు ఈ మ్యాచ్‌లో పెద్దగా కలిసి రాలేదు. తొలి ఇన్నింగ్స్‌లో ఆయన కేవలం 4 పరుగులకే నిరాశపరిచారు. మరోవైపు నాల్గో రోజు లంచ్ సమయానికి టీమిండియా తన రెండో ఇన్నింగ్స్‌లో 29 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 116 పరుగులు చేసింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ డకౌట్‌గా నిరాశపరచగా, కెఎల్ రాహుల్ (35), తొలి ఇన్నింగ్స్ సెంచరీ వీరుడు దేవదత్ పడిక్కల్ (44) బాధ్యతాయుతంగా ఆడి రెండో వికెట్‌కు 65 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (8) పరుగులు మాత్రమే చేసి మరోసారి విఫలమయ్యాడు. ప్రస్తుతం భారత్ మొత్తంగా 294 పరుగుల సురక్షితమైన ఆధిక్యంలో కొనసాగుతోంది. అంతకుముందు భారత్ చేసిన 462 పరుగుల భారీ స్కోరుకు సమాధానంగా శ్రీలంక తమ తొలి ఇన్నింగ్స్‌లో 284 పరుగులకే ఆలౌట్ అయింది. లంక జట్టులో సోనాల్ దినుషా (110) శతకం చేయగా, నిరోషన్ డిక్వెల్లా (80) రన్స్ చేశారు. భారత బౌలర్లు మ్యాచ్‌పై పూర్తి పట్టు సాధించడంతో టీమిండియాకు తొలి ఇన్నింగ్స్‌లోనే 178 పరుగుల కొండంత ఆధిక్యం దక్కింది.

# ఐపీఎల్ అంటేనే భయమేసింది..



ఇంగ్లండ్ వన్డే, టీ20 కెప్టెన్ హ్యారీ బ్రూక్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ఆడడంపై తొలిసారి స్పందించాడు. 2023లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆడిన సీజన్‌లో అభిమానుల నుంచి ఎదురైన విమర్శలు తనపై మానసికంగా, వ్యక్తిగతంగా తీవ్ర ప్రభావం చూపాయని వెల్లడించాడు. ఆ సమయంలో సోషల్ మీడియా, విమర్శలపై ఎక్కువగా దృష్టి పెట్టడం వల్ల మైదానంలో ప్రదర్శనపై ప్రభావం పడడమే కాక.. బయట మానసిక ప్రశాంతత కరువైందని చెప్పాడు. 2023 ఐపీఎల్ వల్ల తాను ఓ సమయంలో డిప్రెషన్‌లోకి వెళిపోయా అని ఇంగ్లండ్ స్టార్ బ్రూక్ చెప్పుకొచ్చాడు.

**అభిమానుల భారీ అంచనాలు:**

హ్యారీ బ్రూక్ 2023 ఐపీఎల్ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున బరిలోకి దిగాడు. అప్పటికే అంతర్జాతీయ క్రికెట్‌లో స్టార్ బ్యాటర్లలో ఒకడిగా గుర్తింపు తెచ్చుకున్న బ్రూక్‌పై అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. అయితే 11 మ్యాచ్‌ల్లో బ్రూక్ 190 పరుగులు మాత్రమే చేశాడు. బ్యాటింగ్ సగటు 21.11గా ఉండగా.. స్ట్రైక్‌రేట్ 123.37గా నమోదైంది. కోల్‌కతా నైట్ రైడర్స్‌పై సెంచరీ చేయడం ఆ సీజన్‌లో హైలైట్‌గా నిలిచింది. ఇటీవల బీబీసీ స్పోర్ట్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో బ్రూక్ ఆ సమయంలో తాను ఎదుర్కొన్న పరిస్థితులను గుర్తు చేసుకున్నాడు.

**నాపై ప్రభావం చూపాయి:**

అభిమానుల విమర్శలు, సోషల్ మీడియాలో వచ్చే కామెంట్లను పట్టించుకోకుండా ఉండటం తనకు చాలా కష్టంగా మారిందని హ్యారీ బ్రూక్ చెప్పాడు. 'ఐపీఎల్ 2023లో ఆడినపుడు విమర్శలు వచ్చాయి. సోషల్ మీడియాలో కామెంట్స్ చూసి కుంగిపోయాను. అది మైదానంలోనూ, బయటా వ్యక్తిగతంగా నాపై ప్రభావం చూపాయి. సోషల్ మీడియాకు పూర్తిగా దూరంగా ఉండాలని నిర్ణయించుకోలేదు కానీ.. ఆ సమయంలో విమర్శలు చదవడం మానేశా. విమర్శలను పూర్తిగా పట్టించుకోకుండా ఉండటం కష్టమే అయినప్పటికీ.. వాటిని నా ఆటపై ప్రభావం చూపకుండా చూసేందుకు ప్రయత్నించా' అని చెప్పాడు.

**మరో కోణం కూడా:**

విమర్శల్లో మరో కోణం కూడా ఉందని హ్యారీ బ్రూక్ అభిప్రాయపడ్డాడు. 'నాపై అభిమానులు ఎక్కువగా అంచనాలు పెట్టుకోవడం ఒక రకంగా అభినందనే. నా ఆటపై ప్రజలు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారంటే.. నేను ఇంకా మెరుగ్గా ఆడగలనని వారు నమ్ముతున్నారు. అయితే నన్ను తీవ్రంగా విమర్శించడంను జీర్ణించుకోలేకపోయా' అని తెలిపాడు. 2025 సీజన్‌లో కూడా సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ బ్రూక్‌ను కొనసాగించింది. అయితే కుటుంబ కారణాలతో అతడు ఐపీఎల్‌కు దూరంగా ఉన్నాడు. అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున 2025 సీజన్‌లో ఆడేందుకు సిద్ధమైనప్పటికీ.. టోర్నీ ప్రారంభానికి కొద్ది రోజుల ముందు ఇంగ్లండ్ జాతీయ జట్టుకు ప్రాధాన్యత ఇస్తూ ఐపీఎల్ నుంచి వైదొలిగాడు.

**బ్రూక్‌పై రెండేళ్ల నిషేధం:**

రెండు సీజన్‌లలో ఐపీఎల్ నుంచి చివరి నిమిషంలో తప్పుకోవడంతో హ్యారీ బ్రూక్‌పై ఐపీఎల్ పాలక మండలి రెండేళ్ల నిషేధం విధించింది. దీంతో అతడు 2027 ఐపీఎల్ వరకు ఆడే ఛాన్స్ లేదు. 2028 ఐపీఎల్ మెగా వేలంలోనే తిరిగి తన పేరును నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది. అయితే ఐపీఎల్ నుంచి వైదొలిగిన నిర్ణయంపై తనకు ఎలాంటి పశ్చాత్తాపం లేదని బ్రూక్ స్పష్టం చేశాడు. తన తొలి ఐపీఎల్ సవ్యంగా సాగకున్నా.. విమర్శలను ఎలా ఎదుర్కోవాలో నేర్చుకున్నానని బ్రూక్ చెప్పుకొచ్చాడు.



# గాలె టెస్టులో అంపైర్‌ను వణికించిన డీఎస్పీ..

భారత్, శ్రీలంక మధ్య గాలెలో జరుగుతున్న తొలి టెస్టు మూడో రోజులో ఓ ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. టీమిండియా స్టార్ పేసర్, డీఎస్పీ మహ్మద్ సిరాజ్ అంపైర్‌ను భయపెట్టాడు. సిరాజ్ విసిరిన బుల్లెట్ త్రోకు అంపైర్ అహ్సన్ రజా వణికిపోయాడు. బౌండరీ సమీపంలో సిరాజ్ బంతిని అందుకుని బలంగా విసరగా.. అది లెగ్ అంపైర్ రజాకు అత్యంత సమీపంగా దూసుకెళ్లింది. పరిస్థితిని గమనించిన అంపైర్ వెంటనే పక్కకు తప్పుకోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనను మైదానంలో ఉన్న రవీంద్ర జడేజా గమనించాడు. అంపైర్ వెంటనే పక్కకు జరగడంతో.. జడేజా నవ్వులు పూయించాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మహ్మద్ సిరాజ్ త్రో వేగం, అంపైర్ వెంటనే తప్పుకున్న తీరు, జడేజా రియాక్షన్ నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. గాలెలో రాడ్ టక్కర్ స్థానంలో అహ్సన్ రజా అంపైర్‌గా వ్యవహరించారు. మ్యాచ్ విషయానికి వస్తే.. మూడో రోజు భారత బౌలర్లు శ్రీలంక బ్యాటర్లను కట్టడి చేశారు. మానవ్ సుతార్, రవీంద్ర జడేజా కలిసి ఏడు వికెట్లు పడగొట్టడంతో శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 284 పరుగులకే ఆలౌటైంది. దీంతో భారత్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 178 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. తొలి టెస్టు ఆడుతున్న మానవ్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. తన తొలి బంతికే వికెట్ తీసిన అతడు.. మెంత్తంగా 4/76 గణాంకాలతో సత్తా చాటాడు. పిచ్‌పై లభించిన టర్న్, బౌన్స్‌ను సద్వినియోగం చేసుకున్న సుతార్.. శ్రీలంక బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడు. మరోవైపు సీనియర్ రవీంద్ర జడేజా 3/57తో కీలక పాత్ర పోషించాడు. ఈ క్రమంలో జడేజా టెస్టు క్రికెట్‌లో 350 వికెట్ల మైలురాయిని కూడా అందుకున్నాడు. భారత బౌలింగ్ దళంలో కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ ఒక్కో వికెట్ తీశారు. ఒక దశలో శ్రీలంక 90 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోవడంతో భారత్ ఫాలోఆన్ విధించే అవకాశం కనిపించింది. అయితే సోనాల్ దినూష, నిరోషన్ డిక్వెల్లా అద్భుతంగా పోరాడారు. ఇద్దరూ కలిసి ఆరో వికెట్‌కు ఏకంగా 146 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి శ్రీలంకను ఆదుకున్నారు. సోనాల్ దినూష 168 బంతుల్లో తన తొలి టెస్టు శతకాన్ని నమోదు చేశాడు. మరోవైపు డిక్వెల్లా 115 బంతుల్లో 80 పరుగులు చేసి కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అయితే ప్రసిద్ధ్ కృష్ణ అద్భుతమైన బంతితో డిక్వెల్లాను ఔట్ చేయడంతో శ్రీలంక వికెట్ల పతనం ఆగలేదు.


# బిజినెస్




# సైబర్ దాడులపై సెబీ అలర్ట్

స్టాక్ మార్కెట్లలో సైబర్ దాడులను అడ్డుకోవడంతో పాటు హెచ్చరికల వ్యవస్థను మరింత వేగవంతం చేయడానికి మార్కెట్ నియంత్రణ సంస్థ 'సెబీ' సోమవారం రెండు కొత్త డిజిటల్ పోర్టల్స్‌ను అందుబాటులోకి తెచ్చింది. సైబర్ సెక్యూరిటీ సంఘటనల రిపోర్టింగ్‌ను గ్లోబల్ ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతం చేస్తూ, 'ఇన్సిడెంట్ రిపోర్టింగ్ పోర్టల్'ను, సమాచారం, విధానపరమైన హెచ్చరికలను షేర్ చేయడానికి 'సైబర్ సురక్షా పోర్టల్'ను సెబీ ప్రారంభించింది. సెబీ సైబర్ డిఫెన్స్ సింపోజియంలో ఛైర్మన్ తుహిన్ కాంత పాండే మాట్లాడుతూ, కేవలం ఒకే సంస్థ భద్రతపై కాకుండా మొత్తం మార్కెట్ వ్యవస్థ సురక్షితంగా ఉందో లేదో చూడటమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. థర్డ్-పార్టీ వెండర్లు, టెక్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా సైబర్ ప్రమాదాలు ఇతర సంస్థలకు వ్యాపించే అవకాశం ఉన్నందున, నియంత్రణ నిబంధనల పాటించే కంపెనీలుగానే కాకుండా నిరంతరం రిస్క్‌ను పర్యవేక్షించే వైపు కంపెనీలు మారాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికత వల్ల సైబర్ దాడులతో పాటు వాటిని అడ్డుకునే రక్షణ చర్యలు కూడా వేగవంతమయ్యాయని సెబీ తెలిపింది. సాఫ్ట్‌వేర్, క్లౌడ్ కాన్ఫిగరేషన్లలో ఉన్న బలహీనతలను నిరంతరం గుర్తిస్తూ వాటిని సరిదిద్దే వ్యవస్థను సంస్థలు ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేసింది. అంతేకాకుండా, భవిష్యత్తులో క్వాంటం కంప్యూటింగ్ నుండి ఎదురయ్యే ముప్పును ముందే ఊహించి, 'పోస్ట్-క్వాంటం క్రిప్టోగ్రఫీ' ప్రాజెక్ట్‌లను అమలు చేయడం ద్వారా సైబర్ సెక్యూరిటీ వ్యూహంలో క్వాంటం రెజిలియెన్స్‌ను ఒక ప్రధాన స్తంభంగా మార్చాలని సెబీ నిర్ణయించింది.

# బ్యాంకింగ్ సంస్కరణలకు ఇదే సరైన సమయం



భారత్ లక్ష్యంగా పెట్టుకున్న 'వికసిత్ భారత్ 2047' దిశగా అడుగులు వేయడానికి ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీలు) తమ ఆర్థిక స్థితిని పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. పీఎస్‌బీలు ఇప్పుడు గతంలో ఎదుర్కొన్న మొండి బకాయిల సమస్య నుంచి చాలావరకు బయటపడ్డాయి. సమర్థంగా ఉన్న బ్యాలెన్స్ షీట్లను కేవలం రిస్క్ తగ్గించుకోవడానికి కాకుండా, దేశ తదుపరి దశ ఆర్థిక వృద్ధికి ఉపయోగించాలని పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలో జరిగిన ఆర్థిక సంస్థల అధిపతుల సమావేశంలో మాట్లాడిన ఆర్థిక మంత్రి, భారత బ్యాంకింగ్ చరిత్రలోనే ఎన్‌పీఏలు అత్యల్ప స్థాయికి చేరాయని, కాబట్టి ఇప్పుడు సంస్కరణలు చేపట్టడానికి ఇంతకంటే మంచి సమయం ఉండదని అన్నారు. 'వికసిత్ భారత్ 2047' లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకుని బ్యాంకింగ్ రంగాన్ని సమీక్షించేందుకు త్వరలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బ్యాంకింగ్ రంగం నుంచి వచ్చే సూచనలు ఈ కమిటీకి ఉపయోగపడతాయని, సిఫార్సులు వచ్చిన వెంటనే ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకునేలా అవి దోహదపడతాయని చెప్పారు. 2047 లక్ష్యానికి 20 ఏళ్ల కంటే తక్కువ సమయమే ఉందని గుర్తుచేస్తూ, భవిష్యత్ ఆర్థిక అవసరాలకు తగ్గట్టుగా బ్యాంకులు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని చెప్పారు.

**భవిష్యత్ ప్రాధాన్యతలు**

దేశ జనాభాలో 29 శాతం ఉన్న 15-29 ఏళ్ల యువతకు విద్యా రుణాలు, స్టార్టప్ ఫండింగ్, పెట్టుబడి ఉత్పత్తులను మరింత దగ్గర చేయాలని ఆర్థిక మంత్రి బ్యాంకులను ఆదేశించారు. సాంకేతికత మార్పులు, వినియోగదారుల ప్రాధాన్యతలకు అనుగుణంగా డిపాజిట్ల సమీకరణను పెంచడం, వ్యవసాయ రంగంలో కేవలం పంట రుణాలే కాకుండా ప్రాసెసింగ్, కోల్డ్ చైన్‌లు, లాజిస్టిక్స్ వంటి వాల్యూ-చెయిన్‌లకు నిధులు అందించడం వంటి అంశాలపై డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ దృష్టి సారించింది. బ్యాంకులు రిస్క్ నియంత్రణలు పాటిస్తూ క్రెడిట్ కార్డ్ విభాగాన్ని విస్తరించాలని, సరికొత్త ఉత్పత్తులతో కస్టమర్ సంబంధాలను బలోపేతం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

# గ్యాస్ సిలిండర్ ధరలు



ఈ నెల(ఆగస్టు) 1వ తేదీన కేంద్ర ప్రభుత్వం కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించిన విషయం తెలిసిందే. 19 కేజీల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్‌పై రూ.206 తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రస్తుతం హైదరాబాద్‌లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.2,985గా ఉంది. గృహ వినియోగ ఎల్‌పీజీ ధరలో ఎలాంటి మార్పు నమోదు కాలేదు. ఈ రోజు(మంగళవారం) ఆగస్టు 18 వ తేది రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.

**తెలంగాణ**

హైదరాబాద్ : రూ.994.00

వరంగల్ : రూ.1013.00

**ఆంధ్రప్రదేశ్**

విశాఖపట్నం : రూ.950.00

విజయవాడ : రూ.966.50

గుంటూరు : రూ.966.50

# ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో జీడీపీ 7 శాతమేనన్న ఇక్రా




భారత ఆర్థికవ్యవస్థ వృద్ధి రేటుకు బ్రేకులు పడే సూచనలు కనిపిస్తున్నాయని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ 'ఇక్రా' అభిప్రాయపడింది. తాజా గణాంకాల ప్రకారం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరపు మొదటి త్రైమాసికంలో దేశ జీడీపీ వృద్ధి గతంలో కంటే తగ్గనుంది. ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత జీడీపీ వృద్ధి రేటు 7 శాతానికి పరిమితం కానుందని ఇక్రా అంచనా వేసింది. గత మార్చి త్రైమాసికంలో నమోదైన 7.8 శాతంతో పోలిస్తే ఇది తగ్గడమే కాకుండా, గత నాలుగు త్రైమాసికాలలోనే అత్యంత కనిష్ట స్థాయి కావడం గమనార్హం. ఆర్థిక వ్యవస్థకు కీలకమైన సేవా రంగంలో వేగం తగ్గడమే ఇందుకు ప్రధాన కారణం. ఈ జూన్ త్రైమాసికంలో పారిశ్రామిక రంగం 7.7 శాతం, సేవా రంగం 7.9 శాతం, వ్యవసాయ రంగం 4 శాతం మేర వృద్ధి నమోదు చేయనున్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వల్ల ముడి సరుకుల ధరలు పెరిగినప్పటికీ, మన దేశంలో పారిశ్రామిక, సేవా రంగాల వ్యాపార పరిమాణం ఇప్పటికీ ఆశాజనకంగానే ఉందని ఇక్రా చీఫ్ ఎకనామిస్ట్ అదితి నాయర్ స్పష్టం చేశారు. పశ్చిమాసియా సంక్షోభం మరింత ముదరడం, రుతుపవనాలపై అనిశ్చితి కొనసాగితే వృద్ధి అంచనాలకు మరింత డౌన్‌సైడ్ రిస్క్ ఉంటుందని నాయర్ పేర్కొన్నారు. మొత్తం 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి భారత జీడీపీ వృద్ధి రేటు గత ఏడాది నమోదైన 7.7 శాతం నుండి 6.7 శాతానికి తగ్గవచ్చని ఇక్రా భావిస్తోంది. పశ్చిమాసియా సంక్షోభం, పెరిగిన ఇంధన ధరలు, వేతన ఖర్చుల భారం సేవా రంగాన్ని దెబ్బతీశాయని, దీనివల్ల ఈ రంగంలోని కంపెనీల సానుకూల ధోరణి గత ఐదేళ్లలోనే అత్యంత

# స్ట్రీమింగ్ తేదీపై అధికారిక ప్రకటన విడుదల




తమిళనాడు ముఖ్యమంత్రి, కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్ ప్రధాన పాత్రలో నటించిన మోస్ట్ అవేటెడ్ మూవీ 'జన నాయగన్'. హెచ్. వినోద్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించగా, మమితా బైజు, ప్రియమణి కీలక పాత్రల్లో కనిపించారు. దళపతి విజయ్‌కు నటుడిగా ఇది చివరి ప్రాజెక్ట్ కావడంతో విడుదల ముందే ఈ సినిమాపై దేశవ్యాప్తంగా భారీ హైప్ క్రియేట్ అయింది. అయితే ఈ చిత్రం సంక్రాంతికి విడుదల కావాల్సి ఉండగా.. పలు కారణాల వల్ల విడుదల వాయిదా పడింది. ఇక ఆ తర్వాత కొద్దికాలంపాటు సెన్సార్ వివాదాల్లో చిక్కుకుంది. ఎట్టకేలకు ఈ సినిమా జూలై 23న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలైంది.అత్యంత భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చినప్పటికీ, ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయాన్ని సాధించలేకపోయింది. థియేటర్లలో విడుదలైన నెలరోజుల్లోనే డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమవ్వడం విశేషం. తాజాగా ఈ సినిమా ఓటీటీ విడుదలపై అధికారిక ప్రకటన వచ్చింది. 'జన నాయగన్' డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5 దక్కించుకోగా.. ఆగస్ట్ 21 నుంచి జీ5లో తమిళ భాషలో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా దళపతి విజయ్‌కు సంబంధించిన ఒక ప్రత్యేక వీడియోను షేర్ చేస్తూ.. 'వన్ లాస్ట్ డ్యాన్స్' అనే ఎమోషనల్ క్యాప్షన్‌ను జత చేసింది. విజయ్ చివరి సినిమా కావడంతో థియేటర్లలో మిస్ అయిన అభిమానులు ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామాను ఓటీటీలో చూసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# టాలీవుడ్ కోలీవుడ్ బాలీవుడ్‌లో సాలిడ్ ఇంపాక్ట్ క్రియేట్ చేస్తున్న యంగ్ హీరోయిన్

'నేరు', 'సూపర్ శరణ్య' చిత్రాలతో ఆకట్టుకున్న అనశ్వర రాజన్, 'ఛాంపియన్' మూవీతో తెలుగు ఆడియన్స్ ముందుకు వచ్చి భలేగా అలరించింది. తన సహజ నటన, క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో తెలుగు ప్రేక్షకులను అలరించింది. కేవలం లుక్స్ పరంగానే కాకుండా ఎమోషనల్ సీన్స్‌లో చూపించిన పరిణతికి రివ్యూవర్ల నుంచి మంచి మార్కులు పడ్డాయి. స్ట్రెట్ తెలుగు సినిమాతో టాలీవుడ్‌లో తన మొదటి పరీక్షను విజయవంతంగా పూర్తి చేసుకుంది.చైల్డ్ ఆర్టిస్ట్‌గా పరిచయమై, 'తన్నీర్మథన్ దింగల్'తో సెన్సేషన్ క్రియేట్ చేసిన నటి అనశ్వర రాజన్ 'యావత్‌మన్ నామ్', 'సూపర్ శరణ్య' చిత్రాలతో క్యూట్‌నెస్ పంచిన ఈ మలయాళ భామ, 'నేరు' సినిమాలో అంధురాలిగా అద్భుత నటనతో మెప్పించింది. రీసెంట్‌గా 'యాబ్రాండ్ అన్వేజన్', 'ప్రణయవిలాసం' వంటి ప్రాజెక్ట్‌లతో సత్తా చాటిన అనశ్వర, ఇప్పుడు సౌత్ అండ్ పాన్-ఇండియా రేంజ్‌లో సరికొత్త ప్రాజెక్ట్‌లతో అలరించేందుకు సిద్ధమవుతోంది. హిందీ రీమేక్ 'యారియా 2'లో విభిన్న పాత్రతో పాటు ప్రస్తుతం దక్షిణాది భాషలలో కొత్త లైనప్‌ను ప్లాన్ చేసుకుంటోంది. కథానాయిక ప్రాధాన్యమున్న పాత్రల ద్వారా తన కెరీర్‌ను బలంగా నిర్మించుకుంటోంది. ఒక నటిగా తనను తాను నిరూపించుకోవడానికి ప్రతి సినిమాను ఒక అవకాశంగా మార్చుకుంది అనశ్వర. మలయాళంలో ఉన్నంత గ్రిప్ ఇతర భాషల్లో రాకపోయినా, తన యాక్టింగ్ స్కిల్స్‌తో నెక్స్ట్ ప్రాజెక్ట్స్‌లో డెఫినెట్‌గా ప్రామిసింగ్ కమ్‌బ్యాక్ ఇస్తుందనడంలో డౌట్ లేదు.మలయాళంలో వరుస హిట్లు కొట్టిన అనశ్వర రాజన్, అదర్ లాంగ్వేజెస్ లోకి ఎంట్రీ ఇచ్చి పాన్ ఇండియా హీరోయిన్ గా ఎదిగేందుకు ప్లాన్ చేస్తుంది. ఇక బోల్డ్ అటెంప్ట్ గా హిందీలో చేసిన 'యారియా 2' సినిమా బాక్సాఫీస్ దగ్గర మిశ్రమ స్పందన తెచ్చుకున్నప్పటికీ, అనశ్వర పర్ఫార్మెన్స్ అండ్ క్యూట్‌నెస్‌కి నార్త్ ఆడియన్స్ నుండి మంచి మార్కులే పడ్డాయి. ఇప్పుడు పాటు, తమిళ్‌లో జి.వి. ప్రకాష్‌తో 'లక్కీ ది సూపర్‌స్టార్' మరియు రొమాంటిక్ డ్రామా 'విత్ లవ్' చిత్రాలతో తన కెరీర్‌ను చాలా ప్లాన్డ్‌గా విస్తరిస్తోంది.








# అసలు నిజం ఇదే!

మాస్ మహారాజా రవితేజ, ఫీల్ గుడ్ చిత్రాల దర్శకుడు శివ నిర్వాణ కాంబినేషన్‌లో రాబోతున్న డివోషనల్ యాక్షన్ డ్రామా 'ఇరుముడి'. ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో సాయి కుమార్, బేబీ నక్షత్ర కీలక పాత్రలో కనిపించబోతున్నారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించిన ఈ సినిమా ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. అయితే మూవీ రిలీజ్ డేట్ దగ్గరపడుతుండటంతో మేకర్స్ ప్రమోషన్స్ జోరు పెంచారు. ఇందులో భాగంగా ఈ చిత్రం నుంచి అయ్యప్ప స్వామికి సంబంధించిన "మల్లెపూల పల్లకి బంగారు పల్లకి" అనే భక్తి పాటను మేకర్స్ విడుదల చేశారు. ఈ పాటలో ఒక ఊహించని బిగ్ సర్‌ప్రైజ్ ఎలిమెంట్ ఉందంటూ చిత్రయూనిట్ క్లూ ఇవ్వడంతో, సోషల్ మీడియాలో రకరకాల వార్తలు షికారు చేయడం మొదలయ్యాయి.ముఖ్యంగా, అయ్యప్ప స్వామి భక్తుడైన గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నిజజీవితంలో తరచూ మాలధారణలో కనిపిస్తుంటారు కాబట్టి, ఈ పాటలో ఆయన అయ్యప్ప స్వామి మాల వేసుకుని గెస్ట్ అప్పియరెన్స్ ఇస్తున్నారనే వార్త నెట్టింట విపరీతంగా ప్రచారంలోకి వచ్చింది. మెగా అభిమానులు ఈ వార్తతో పండగ చేసుకున్నారు. తాజాగా, ఈ ప్రచారంపై రామ్ చరణ్ టీమ్ స్పందిస్తూ. ""ఇరుముడి'లోని 'మల్లెపూల పల్లకి' పాటలో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ గారు కనిపిస్తారంటూ గత రెండు రోజులుగా వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదు. అవన్నీ పూర్తిగా అవాస్తవాలు. అభిమానులు, ప్రేక్షకులు ఇటువంటి వదంతులను నమ్మవద్దని, సోషల్ మీడియాలో ప్రచారం చేయవద్దని మనవి చేస్తున్నాము" అని చరణ్ టీమ్ ప్రకటన ద్వారా స్పష్టం చేయడంతో పుకార్లకు ఫుల్‌స్టాప్ పడింది.




# సైలెంటుగా 50 కోట్లు కొట్టిన కొరియన్ కనకరాజు


మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కిన నాన్‌స్టాప్ ఎంటర్‌టైనర్ 'కొరియన్ కనకరాజు' బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం విడుదలైన మొదటి రోజు నుంచే పాజిటివ్ టాక్‌తో థియేటర్లలో దూసుకుపోతోంది. ₹12 కోట్ల బ్రేక్ ఈవెన్ టార్గెట్‌తో బరిలోకి దిగిన ఈ చిత్రం, కేవలం 10 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా ₹50.30 కోట్ల గ్రాస్ కలెక్ట్ చేసి ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యపరిచింది.ప్రొడ్యూసర్ల నుంచి డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు మరియు క్యాంటీన్ ఓనర్ల వరకు ప్రతి ఒక్కరికీ కనకవర్షం కురిపిస్తూ టేబుల్ ప్రాఫిట్స్ అందించింది. వరుస సినిమాల తర్వాత వరుణ్ తేజ్‌కు ఇది కెరీర్ బెస్ట్ కమ్‌బ్యాక్ మూవీగా నిలిచింది. ఆయన టైమింగ్, కామెడీ యాంగిల్‌కు ప్రేక్షకులు ఫిదా అవుతున్నారు. దర్శకుడు మేర్లపాక గాంధీ మార్క్ కామెడీ, ఎస్. తమన్ అదిరిపోయే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లడంతో నిర్మాణ సంస్థలకు ఈ విజయం సరికొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది.

# 'సిగ్మా' రిలీజ్ డేట్ ఫిక్స్..




'సిగ్మా' సినిమా విడుదల ఇప్పట్లో ఉండదని, ప్రాజెక్ట్ ఆలస్యం అవుతోందంటూ సోషల్ మీడియాలో రకరకాల పుకార్లు షికారు చేశాయి. ఈ పుకార్లన్నింటికీ చెక్ పెడుతూ మూవీ మేకర్స్ తాజాగా పవర్‌ఫుల్ అప్‌డేట్‌తో అభిమానుల ముందుకు వచ్చారు. గాంధీ జయంతి సందర్భాన్ని పురస్కరించుకుని ఈ ఏడాది అక్టోబర్ 2న 'సిగ్మా' చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున థియేటర్లలో విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. అలాగే "అక్టోబర్ 2న జరగబోయే ఆ భారీ దోపిడీ కోసం తేదీని గుర్తుంచుకోండి. సిగ్మా వెండితెరపై సందడి చేయడానికి సిద్ధంగా ఉంది" అనే క్యాప్షన్ జత చేశారు. ఇక ఈ అనౌన్స్‌మెంట్‌తో పాటు హీరో సందీప్ కిషన్‌కు సంబంధించిన ఒక క్యూరియోసిటీని పెంచే పోస్టర్‌ను కూడా విడుదల చేశారు.
ఈ పోస్టర్‌లో సందీప్ కిషన్ తన గది కిటికీ నుంచి బయటకు పవర్ ఫుల్ లుక్‌తో చూస్తుండగా, ఆయన పక్కనే ఒక పెంపుడు కుక్క కూడా నిల్చొని ఉండటం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.ఈ పోస్టర్ సోషల్ మీడియాలో ఒక్కసారిగా సినిమాపై విపరీతమైన హైప్‌ను క్రియేట్ చేసింది.

# పవర్ ఫుల్ పాత్రలో నిధి అగర్వాల్..



టాలీవుడ్ యంగ్ బ్యూటీ నిధి అగర్వాల్ ఇటీవల నటించిన ది రాజాసాబ్, హరి హర వీరమల్లు వంటి చిత్రాలు బాక్సాఫీసు వద్ద ఆశించినంత స్థాయిలో రాణించలేకపోయాయి. దీంతో గత కొద్ది కాలంగా సినిమాల విషయంలో ఆచీ తూచీ అడుగులు వేస్తున్నారు. చాలా రోజుల నుంచి కాళీగా ఉంటున్న ఆమె ఈ విరామాన్ని తన రూట్ మార్చుకోవడానికి ఒక అవకాశంగా మలుచుకున్నారు. కమర్షియల్ కథల వెంట పడకుండా, పూర్తిగా తన పాత్రపైనే నడిచే ఒక డిఫరెంట్ సబ్జెక్ట్‌ను ఎంచుకుని సైలెంట్‌గా రీ-ఎంట్రీకి ప్లాన్ చేశారు. దర్శకుడు శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వంలో వరాహ్ ఫిల్మ్స్ సునీత్ పడోల్కర్ నిర్మాణంలో రూపొందిస్తున్న ఈ మైథాలజికల్ థ్రిల్లర్ పూజా కార్యక్రమాలతో హైదరాబాద్‌లో సెట్స్ పైకి వెళ్లింది.సాధారణంగా కమర్షియల్ సినిమాల్లో గ్లామర్ పాత్రలకే పరిమితమయ్యే హీరోయిన్లు ఇటువంటి కాన్సెప్ట్ చిత్రాలు చేసినప్పుడే నటిగా నిరూపించుకునే అవకాశం లభిస్తుంది. నిధి కూడా సరిగ్గా ఇదే పాయింట్‌ను టార్గెట్ చేసినట్లు కనిపిస్తోంది. ఈ సినిమా నుంచి విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్ ఇప్పుడు కాన్సెప్ట్ పరంగా అందరినీ ఆకట్టుకుంటోంది. సంప్రదాయ పట్టుచీర కట్టుకుని దీపంతో కనిపిస్తున్న నిధి వెనుక, ఆరు చేతులతో ఉన్న దైవిక ఉగ్రరూపం డిజైన్ చేసిన విధానం సినిమా కథపై అనేక సందేహాలను, ఆసక్తిని పెంచుతోంది. పురాణాల నేపథ్యానికి థ్రిల్లర్ ఎలిమెంట్స్ జోడించి తీస్తున్న ఈ పవర్‌ఫుల్ లేడీ ఓరియంటెడ్ ప్రాజెక్ట్, నిధి అగర్వాల్ కెరీర్‌కు ఎలాంటి టర్నింగ్ పాయింట్ కానుందో చూసేందుకు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**